



ప్రొటెం స్పీకర్‌గా ఎన్నికైన గోరంట్లకు అధికారుల అభినందనలు



# ఈట్ స్ట్రీట్.. సంగతేంటి?

- బాలికల వసతి గృహాల నడుమ తినుబండారాల దుకాణాలు
- విద్యాలయ వాతావరణం కలుషితం
- కమీషన్ల కక్కుర్తితో వైసీపీ నేత ఏర్పాటు
- దూడూ బసవన్నల్లా అధికార గణం
- ఆహార భద్రత అనుమతులు నిల్
- నిబంధనలు బేఖాతర్
- ఎన్ని విమర్శలొచ్చినా బలాదూర్

**వైసీపీ నేతల ప్రాపకం కోసం గత ప్రభుత్వంలో కొందరు ఉన్నతాధికారులు డూడూ బసవన్నల్లా వ్యవహరించారు. వీరిలో నగరపాలక సంస్థ, జిల్లా ఉన్నతాధికారులు ముందు వరుసలో ఉంటారు. వైసీపీ వాళ్లు చెప్పడమే ఆలస్యం వీళ్లు ఆగమేఘాలకంటే వేగంగా ఏర్పాట్లు పూర్తి చేసేవారు. ప్రజల నుంచి ఎన్ని విమర్శలొచ్చినా చెవులకెక్కలేదు. నిబంధనలకు నీళ్లొదిలేశారు. అలాంటి అనాలోచిత కార్యక్రమాల్లో ఒకటి ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని 'ఈట్ స్ట్రీట్'. కమీషన్ల కక్కుర్తి మత్తులో ఓ వైసీపీ నేత ఈ దుకాణాల ఏర్పాటుకు 'ప్లాన్' చేశారు. దీనికి అధికారులు యథావిధిగా తలాడించారు. చక్కటి విద్యా వాతావరణం కలుషితమవుతున్నా కళ్లకు కనిపించలేదు. వసతి గృహాల బాలికల భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉన్నా పట్టింపేలేదు. యువతకు ఉపాధి మాటున దుకాణాలు పెట్టేశారు. ఒకసారి అగ్ని ప్రమాదం సంభవించగా అదృష్టవశాత్తూ వసతి గృహ విద్యార్థులు బయటపడ్డారు. ఈ ప్రాంతంలో ఈట్‌స్ట్రీట్ సరికాదంటూ రోడ్డెక్కిన ప్రజా, విద్యార్థి సంఘాల నోళ్లను వైసీపీ వాళ్లు భయంతో మూయించారు. అయితే.. ఇప్పుడు ప్రజాకాంక్షల ప్రభుత్వం వచ్చింది. దీంతో గత పాలకులు చేసిన తప్పులను సరిదిద్ది, అక్రమాలకు కొమ్ముకాసిన అధికారుల పనిపట్టే బాధ్యత నూతన పాలకులపై ఉంది. ఈట్ స్ట్రీట్, హ్యాపీ స్ట్రీట్ వంటి వాటి పని పడతారా? లేదా? అని జనం ఎదురు చూస్తుండడంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.**

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

ఈట్ స్ట్రీట్ పేరుతో ఎంతో చారిత్రక ఘనత ఉన్న ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో అర్ధరాత్రి దాటినా తెరిచి ఉంచే ఆహార దుకాణాలను ఏర్పాటు చేయడంపై అప్పట్లో పెద్దఎత్తున విమర్శలు వినిపించాయి. సాంస్కృతిక రాజధానికిగా భాసిల్లే రాజమహేంద్రికి అనవసర పోకడలను పరిచయం చేయడం భావ్యం కాదనే ఆవేదనా వ్యక్తమైంది. ప్రజా సంఘాలు ఉద్యమాలు, ధర్నాలకు సైతం ఉపక్రమించాయి. అయితే అవేమీ వైసీపీ పాలకులకు కనబడలేదు. దీంతో ఇక్కడ సుమారు 40 వరకూ షాపులను ఏర్పాటుచేశారు. కార్పొరేషన్‌కి నెలకు రూ.10 వేల అద్దెతో లాటరీ పద్ధతిలో షాపులు కేటాయించారు. కానీ వాటిని దక్కించుకున్న వాళ్లు సబ్‌లీజుకు నెలకు సుమారు రూ.30 వేల ప్రాతిపదికన వేరొకరికి ఇచ్చేశారు. ఈ అక్రమాల వెనుక వైసీపీ నేతలు ఉన్నారని చెబుతారు. వారికి కార్పొరేషన్ ఉన్నతాధికారి కూడా కలిసి రావడంతో అడ్డూ అదుపూలేకుండాపోయింది. దీంతో రాత్రిళ్లు ఈ ముసుగులో దందాలు, సెటిల్‌మెంట్లు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ఒకసారి మునిసిపల్ కమిషనర్ తన కుటుంబంతో టిఫిన్ చేస్తుండగా దగ్గరలోనే యువత హల్‌చల్ సృష్టించారు. ఈట్‌స్ట్రీట్‌లో ధరలు కూడా విపరీతంగా దోచేస్తున్నారు.



విద్యార్థినుల హాస్టల్ గేటు వద్దే వంటకాలు

### పాపం విద్యార్థినులు..

ఈ దుకాణాల వల్ల విద్యార్థినులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. విద్యా వాతావరణం కాస్తా సంత మాదిరిగా తయారైంది. ఈ ఈట్‌స్ట్రీట్ చుట్టూ ఐదు బాలికల వసతి గృహాలు ఉన్నాయి. చీకటి పడితే వారంతా భయభయంగా గడపాల్సిందే. సాయంత్రం నాలుగు గంటలు దాటితే దుకాణాల వద్ద అరుపులు, కేకలు, కుర్రకారు హల్‌చల్‌తో వసతి గృహాల విద్యార్థినులు కనీసం దుస్తులు దండెంపై వేసేందుకు బయటకు రావడానికి కూడా భయపడుతున్నారు. కొందరు యువకులు ఈట్‌స్ట్రీట్‌కి వచ్చామనే మిషతో హాస్టళ్ల వద్ద తిరుగాడుతున్నారు. వసతి గృహాల బాలికలు, విద్యార్థినుల వైపు చూస్తూ అసభ్యకరంగా సైగలు చేయడం, వెకిలి చేష్టలకు దిగడం నిత్యకృత్యమైపోయింది. పైగా ఇక్కడ నూడుల్స్, కబాబ్స్, టిక్కా వంటి వంటకాల నుంచి వస్తున్న పొగ, వాసనకు విద్యార్థినులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కళ్లు మండుతున్నాయని చెబుతున్నారు. వీటికి తోడు వాహనాల హారన్లు, దుకాణాల్లో డీజే పాటల వల్ల రాత్రివేళల్లో చదువుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. కిటికీలు మూసుకొన్నా అర్ధరాత్రి వరకూ శబ్దాలతో హాస్టల్ విద్యార్థులకు కంటిపై కునుకు ఉండడం లేదు. పైగా ఇక్కడే అర్బన్ హెల్త్ సెంటర్, ఇంటర్ బోర్డు కార్యాలయం కూడా ఉండడం గమనార్హం. అయినా ఇది ఎవరికీ పట్టడం లేదు.

### అంతా అక్రమమే

ఈట్‌స్ట్రీట్‌లో నిబంధనలు అన్నీ ఉల్లంఘనలే. గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వాడేస్తున్నా అధికారుల కళ్లకు కానరావడం లేదు. మునిసిపల్ ట్యాంకరుతో తాగునీటిని ఉచితంగా అందిస్తున్నారు. ట్యాంకరు నీరు రూ.300 వరకూ ఉంది. ఈ లెక్కన రెండేళ్ల నుంచీ మునిసిపాలిటీ ఖజానాకు పెద్ద నష్టమే జరిగింది. ఇక్కడ వ్యాపారాన్ని తోపుడు బండి, మొబైల్ వాహనం కేటగిరీ కింద విభజించి ఆ మేరకు దుకాణాలు కేటాయించారు. అంటే వ్యాపార వేళలు ముగిసిన తర్వాత వాటిని తీసుకెళ్లిపోవాలి. కానీ కంటెయినర్లను తీసుకొచ్చి శాశ్వత ప్రాతిపదికన కొట్లు పెట్టేశారు. మొబైల్ వాహనం ఒక్కటీ లేదు. కంటెయినర్లనే వాహనాల కింద ఊహించుకోవాలనే చిత్రమైన సమాధానం అప్పట్లో అధికారుల నుంచి వినిపించేది. ఇక్కడ ఏర్పాటు చేసిన దుకాణాలకు ట్రేడ్ లైసెన్సులు తదితర అవసరమైన అనుమతులూ లేవని తెలుస్తోంది. ఏదో సాంకేతిక కారణం ఉందని సుమారు రెండేళ్ల నుంచీ మునిసిపల్ కార్పొరేషన్ తాత్సారం చేస్తోంది. దీంతో ఆహార నియంత్రణ అధికారులూ సంబంధిత ఫుడ్ సేఫ్టీ సర్టిఫికెట్లు ఇవ్వడానికి వీలు లేకుండాపోయింది. ఇష్టానుసారం నూనెలు, ఎసెన్సులు, రంగులు వాడేస్తూ ప్రజారోగ్యానికి చేటు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. మొత్తానికి ఎలాంటి అనుమతులూ లేకుండా, విద్యా వాతావరణాన్ని కలుషితం చేస్తున్న దుకాణాలకు జిల్లా అధికారులు సైతం వచ్చి తింటుండడం విస్తుగొలుపుతోంది.

### అగ్ని ప్రమాదం జరిగినా..

ఈట్ స్ట్రీట్‌లో గత ఏడాది డిసెంబరు 23 అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్, జ్యూస్ సెంటర్ మంటల్లో దగ్ధమయ్యాయి. షాపుల్లోని సామగ్రి చాలామటుకు బూడిదైంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయితే బాలికల వసతి గృహాలకు సమీపంలోని దుకాణాలు కాలిపోయాయి. దీంతో అర్ధరాత్రి వేళ వసతి గృహాల్లోని పిల్లలు భయభ్రాంతులకు గురయ్యారు. రాత్రంతా కంటిపై కునుకు లేకుండా ఇబ్బంది పడ్డారు. పిల్లలు నిద్రించే సమయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఆ సమయంలో మంటలు హాస్టల్ లోపలకు వ్యాపించి ఉంటే బాధ్యులెవరని విద్యార్థులు, తల్లిదండ్రులు అడిగిన ప్రశ్నకు సమాధానం కరువైంది. విద్యార్థినుల భద్రత, ప్రజారోగ్యం దృష్ట్యా ఈ దుకాణాలపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వంటివి దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

### చదువుల వాతావరణం కలుషితం.. తరలిస్తాం

ఈట్‌స్ట్రీట్‌తో విద్యార్థినులు బాగా ఇబ్బంది పడుతున్నారు. కళాశాల వాతావరణం కలుషితం అవుతోంది. గతంలోనే నాకు ఫిర్యాదులు అందాయి. అయితే, ఎవరైతే ఫిర్యాదు చేశారో వాళ్లను వైసీపీ వాళ్లు భయపెట్టారు. ఎప్పుడైతే ప్రభుత్వం మారిందో ఈట్‌స్ట్రీట్, హ్యాపీస్ట్రీట్ సమస్యలను ప్రజలు నా దృష్టికి తీసుకొస్తున్నారు. వ్యాపారస్తులకు, ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోడానికి ఇప్పటికే ఉపక్రమించాం. కోటిలింగాల పేట గోదావరి గట్టుపైకి తరలించడానికి ప్రయత్నాలు మొదలుపెట్టాం. ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. ప్రజాభీష్టం మేరకు ఆ దిశగా చర్యలు చేపడుతున్నాం. వాటిని కచ్చితంగా త్వరలోనే తరలిస్తాం.

- ఆదిరెడ్డి వాసు, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే విజేత

### హాస్టల్ వద్ద చాలా సమస్యగా ఉంది

ఈట్‌స్ట్రీట్ పెట్టిన తర్వాత హాస్టల్ వద్ద చాలా సమస్యగా ఉంది. అర్ధరాత్రి వరకూ పెద్ద పెద్ద శబ్దాలతో పాటలు, వాహనాల మోత, గోలతో చదువుకోడానికి ఇబ్బంది అవుతోంది. నిద్ర కూడా సరిపడా ఉండడం లేదు. వంటలు అదో రకమైన వాసన వస్తుంటాయి. ఆ పొగకు కళ్లు మంటలు వస్తున్నాయి. మా గేటు వద్దే పొయ్యిలు పెట్టి వండుతున్నారు. అక్కడే బైక్‌లు పార్కింగ్ చేస్తుండడంతో మేం బయట నుంచి వెళ్లేప్పుడు ఇబ్బంది పడుతున్నాం. పైగా కొంతమంది యువకులు ఈట్‌స్ట్రీట్ వంకతో హాస్టల్ బయట ఉంటున్నారు. వాళ్లను మేమే రమ్మన్నామనే అపవాదు పడుతోంది. అసలు విద్యార్థుల వసతి గృహాలు ఉండే ప్రాంతంలో ఇలాంటివి అవసరమా?.

- బ్లెస్సీ, బయోటెక్ విద్యార్థిని, రాజమహేంద్రవరం

## ప్రొటెం స్పీకర్‌గా గోరంట్ల

**అరుదైన గౌరవం.. పలువురి అభినందనలు**

**నేడు గవర్నర్‌చే బుచ్చయ్యచౌదరి ప్రమాణ స్వీకారం**

రాజమహేంద్రవరం రూరల్/సిటీ, జూన్19: రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి శాసనసభ ప్రొటెం స్పీకర్‌గా నియమితులయ్యారు. ఏడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన సీనియర్ నేత బుచ్చయ్యచౌదరి ప్రొటెం స్పీకర్ హోదాలో శుక్రవారం రాష్ట్ర అసెంబ్లీ తొలి సమావేశాల్లో ఎమ్మెల్యేలతో ప్రమాణస్వీకారం చేయించే బాధ్యతను సీఎం చంద్రబాబునాయుడు అప్పగించారు. ముందుగా గురువారం నాడు బుచ్చయ్యచౌదరితో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్ ప్రమాణస్వీకారం చేయిస్తారు. తర్వాత ప్రొటెం స్పీకర్ హోదాలో శాసనసభలో శుక్రవారం నూతన ఎమ్మెల్యేలతో గోరంట్ల ప్రమాణస్వీకారం చేయిస్తారు. అనంతరం స్పీకర్, డిప్యూటీ స్పీకర్ల ఎన్నిక నిర్వహించనున్నారు. కాగా ప్రొటెం స్పీకర్ వంటి అరుదైన అవకాశాన్ని గోరంట్ల దక్కించుకోవడం పట్ల టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం రాజమహేంద్రవరంలోని గోరంట్ల నివాసానికి పలువురు ప్రభుత్వ అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వెళ్లి పుష్పగుచ్ఛాలతోను, శాలువాతోను సత్కరించి అభినందనలు తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ కే వెంకటేశ్వరరావు, సబ్‌రిజిస్ట్రార్ అధికారు లు, వివిధ శాఖల అధికారులు, అంగన్వాడీలు, ఆశవర్కర్లు, పంచాయతీ సెక్రటరీలు, రిటైర్డ్ ఉద్యోగులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ ప్రొటెం స్పీకర్ తనకు వద్దని చెప్పానని, ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ఫోన్ చేసి తనను ఎంపిక చేసినట్టు చెప్పారన్నారు. సీనియర్‌గా ఈ బాధ్యత స్వీకరించాలని అనడంతో అంగీకరించానని ఆయన చెప్పారు.



బుచ్చయ్య చౌదరికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న అభిమానులు



అమరావతిలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పవన్‌కల్యాణ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి కందుల దుర్గేష్

## పవన్‌కల్యాణ్‌కు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి దుర్గేష్

నిడదవోలు, జూన్19: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా కొణిదల పవన్‌కల్యాణ్ అమరావతి రాష్ట్ర సచివాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



చిరంజీవి పార్కు డిజైన్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

## చిరంజీవి పార్కుకు ఇక మహర్దశ!

**రూ.1.16 కోట్ల వ్యయంతో పార్కు ఆధునికీకరణ పనులు**

**డిజైన్ పరిశీలించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**

రాజమహేంద్రవరం సిటీ, జూన్19: నగరంలోని కంబాలచెరువు ప్రధాన రహదారిలో 20 ఏళ్ల కిందట నిర్మించిన చిరంజీవి పార్కుకు ఇన్నేళ్ల తర్వాత మహర్దశ పట్టనుంది. అప్పట్లో ఈ పార్కును ప్రారంభించడానికి మెగాస్టార్ చిరంజీవి వచ్చారు. కానీ కంబాలచెరువు సెంటర్‌ను వేలాదిమంది అభిమానులు చుట్టుముట్టగా, వేదిక దిగి కిందకు వెళ్లి ఆ పార్కు రిబ్బన్‌కట్ చేసే అవకాశం లేకపోవడంతో అప్పటి మేయర్ ఎంఎస్ చక్రవర్తి చేతుల మీదుగా చిరంజీవి ప్రారంభింపజేశారు. తర్వాతికాలంలో ఈ పార్కు నిర్వహణ సక్రమంగా లేక నిర్లక్ష్యానికి గురైంది. ఈ పార్కులో మదర్‌థెరిసా విగ్రహాన్ని కూడా అప్పుడే ప్రారంభించారు. కూటమి అధికారంలోకి వచ్చాక చిరంజీవి పార్కును తిరిగి నిర్మాణం చేపట్టడానికి సమయాత్తమయ్యారు. రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ నుంచి రూ. కోటి 16 లక్షల వ్యయంతో పార్కు పునర్నిర్మాణం, మదర్ థెరిసా విగ్రహం ఏర్పాటుపనులు చేపట్టనున్నారు. అందుకోసం పార్కు పాత గోడలు తొలగించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఈ పార్కును బుధవారం పరిశీలించారు. పార్కు నిర్మాణాలకు సంబంధించిన వివరాలను, ప్లాన్‌ను నగరపాలక సంస్థ డీఈ అలీ ఎమ్మెల్యేకు తెలిపారు.

### ప్రణాళికబద్ధంగా నగర అభివృద్ధి

రాజమహేంద్రవరంలో వైసీపీ పాలకులు చేసిన తప్పులు కడిగే ప్రయత్నం చేస్తున్నామని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. నగరంలో ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టినా స్థానికులకు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల వల్ల స్వలాభం తప్ప ప్రజల ఇబ్బందులను పరిగణలోకి తీసుకోలేదన్నారు. చిరంజీవి పార్కును వైసీపీ ప్రభుత్వం చాలా నిర్లక్ష్యం చేసిందన్నారు. చిరంజీవి సోదరుడు పవన్‌కల్యాణ్ భాగస్వామ్యంతో ఏర్పడిన కూటమి ప్రభుత్వ హయాంలో మళ్లీ ఈ పార్కును సుందరంగా తీర్చిదిద్దడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, జనసేన నగర అధ్యక్షుడు వై శ్రీను, శెట్టిబలిజసాధికార సమితి కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు, తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవీవరప్రసాద్, మజ్జి రాంబాబు, మరుకుర్తి రవియాదవ్, కోసూరి చండీప్రియ, మాలే విజయలక్ష్మి, దాస్యం ప్రసాద్, జనసేన నేతలు ఆసూరి సుధాకర్, గెద్దం నాగరాజు తదితరులు ఉన్నారు.







విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్పులను అందజేస్తున్న ఎస్పీ జగదీశ్

## తల్లిదండ్రుల కలలను పిల్లలు సాకారం చేయాలి : ఎస్పీ

రాజమహేంద్రవరం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పిల్లలు కష్టబడి చదువుకుని తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఎస్పీ జగదీశ్ పిలుపునిచ్చారు. పది, ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు సాధించిన పోలీసు సిబ్బంది పిల్లలకు ఆయన మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో 56 మంది పిల్లలకు జిల్లా పోలీస్ సంక్షేమ నిధి నుంచి నగదు బహుమతులు ఇవ్వడంతోపాటు ఆయా స్కూళ్ల యాజమాన్యాలను సత్కరించారు. తల్లిదండ్రులతో, పెద్దవారితో గౌరవంగా నడుచుకోవాలని.. క్రమశిక్షణ, పట్టుదల లక్ష్యాన్ని చేరువ చేస్తాయని ఈ సందర్భంగా పిల్లలకు ఎస్పీ హితబోధ చేశారు. ఆసక్తి ఉన్న రంగంలోకి ప్రవేశించి సమాజానికి సేవ చేయాలన్నారు. విజయవంతమైన వ్యక్తులుగా కీర్తి గడించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఎల్.చెంచిరెడ్డి, సౌత్ జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ పాల్గొన్నారు.

## కడియపులంకలో భారీ చోరీ

- 10 కాసుల బంగారం, వెండి, రూ.లక్ష నగదు అపహరణ
- డీఎస్పీ అంబికాప్రసాద్, సీఐ తులసీధర్ పరిశీలన - 5లో

## రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించాలి : నల్లమిల్లి

అనపర్తి, జూన్ 19 : తన అనపర్తి నియోజకవర్గంలో గత పాలకుల నిర్లక్ష్యంతో అనేక రోడ్లు అధ్వాన స్థితికి చేరుకున్నాయని, వాటి అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కలెక్టర్ మాధవీలతను కోరారు. బుధవారం రాజమహేంద్రవరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నల్లమిల్లి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో భేటీ అయిన ఎమ్మెల్యే అనపర్తి నియోజకవర్గంలో అధ్వాన స్థితికి చేరుకున్న రోడ్ల పరిస్థితిని ఆమెకు వివరించారు. అదేవిధంగా నియోజకవర్గంలోని అభివృద్ధి, నిర్వహణ పనులపై ఆయన చర్చించారు. ముఖ్యంగా కెనాల్ రోడ్డు దుస్థితిని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చానని, దీనికి ఆమె సానుకూలంగా స్పందించారని అన్నారు.



అనపర్తి నియోజకవర్గ అభివృద్ధిపై కలెక్టర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

## గంజాయి, సారా నిర్మూలనకు ఉక్కుపాదం మోపుతా

**ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా : ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి**

కడియం, జూన్ 19: గంజాయి, సారా వంటి మత్తుపదార్థాల వల్ల యువత పెడదోవ పడుతోందని, అందుకే వీటి నిర్మూలనకు ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని, వాటిపై ఉక్కుపాదం మోపుతామని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. కడియం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్ అధ్యక్షతన బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక గంజాయి వంటి మాదక ద్రవ్యాలు పెరిగిపోయాయన్నారు. నెలరోజుల్లోనే సారా, గంజాయి నిర్మూలనకు పటిష్ట చర్యలు చేపడతామన్నారు. ఇందుకోసం నాయకులు, తల్లిదండ్రులు, సహకరించాలన్నారు. ఎవరి సిఫార్సులను పట్టించుకోకుండా కేసులు నమోదు చేయాలని సీఐ తులసీధర్‌కు సూచించారు. గంజాయి రహిత నియోజకవర్గంగా రూరల్ నియోజకవర్గం త్వరలోనే మారుతుందని, గంజాయికి సంబంధించి మూలాలన్నింటిని సమూలంగా అరికడతామన్నారు. దీనికి అధికారులతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో పరిపాలన గాడి తప్పిందని, వాటిని చక్కబెట్టేందుకు చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ నేతృత్వంలో ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు వివరించారు. అయితే నెలరోజుల్లో అన్ని శాఖల అధికారులు నియోజకవర్గంలోని కడియం మండలం పరిధిలో సమస్యలు, వాటి పరిష్కారానికి కావాల్సిన నిధుల వివరాలను రూపొందించాలని, అభివృద్ధికి అవసరమైన నిధులు సమకూర్చడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి పదవి రానందుకు తనకు విచారం లేదని, ప్రజాసేవ చేయడానికి ఎమ్మెల్యే పదవి సరిపోతుందని, త్వరలోనే తమ పాలనను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఐదేళ్లపాటు ఎమ్మెల్యేగా ఉన్న తనకు గత ప్రభుత్వం ఏనాడు ప్రొటోకాల్ పాటించలేదని, వైసీపీ ప్రభుత్వం వంటి దుర్మార్గపు పాలన, కక్షసాధింపు తన రాజకీయ జీవితంలో ఏనాడూ చూడలేదని గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్, వైస్ ఎంపీపీలు కలిదిండి విశాలాక్షి, పంతం గణపతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీడీవో రాజ్‌మనోజ్, సీఐ తులసీధర్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.



కడియం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే గోరంట్లను సత్కరిస్తున్న ఎంపీపీ ప్రసాద్, వైస్ ఎంపీపీ పంతం గణపతి

## ఆ.. ఇసుక ఆపండి!

- ఎవరు అనుమతిచ్చారో.. ఎవరెవరో దోచుకుపోతున్నారు
- జనసేన సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ ఆరోపణ

రాజమహేంద్రవరం, జూన్19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో అక్రమంగా తవ్వి, స్టాక్ పాయింట్లగా పెట్టిన ఇసుకను ఎవరెవరో ఎత్తుకుపోతున్నారని, కొత్త ఇసుక విధానం అమలులోకి వచ్చేవరకూ ఎక్కడి ఇసుకను అక్కడే ఉంచాలని రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి అనుశ్రీ (అత్తి) సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. లాలాచెరువు స్టాక్ పాయింట్ నుంచి అధికారులెవరో అనుమతిచ్చారని, ఎవరో అమ్మేసుకుంటున్నారన్నారు. ముందు అధికారులు జిల్లాలో ప్రస్తుతం స్టాక్ పాయింట్లలోనూ, గోదావరి ర్యాంపుల గట్టు మీద ఎంత ఇసుక ఉందో లెక్కలు తెలియజేయాలని, జిల్లాలో సుమారు స్టాక్‌లలోనే 6 లక్షల టన్నుల ఇసుక ఉంటుందని, ఇక ర్యాంపులలో మరింత ఇసుక రాశులు ఉన్నాయని ఆయన అన్నారు. అధికారులు జోక్యం చేసుకుని, వెంటనే ఈ ఇసుక తరలిపోకుండా ఆపాలని సత్యనారాయణ కోరారు.

# కోలుకుంటున్న కొమ్మనాపల్లి

**కొత్తగా కేసులు నమోదు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు, వైద్య సిబ్బంది**

**మరోవైపు బెండపూడిలో కేసులు పెరుగుతుండడంతో ఆందోళన**


లీకేజీ పనులు పరిశీలిస్తున్న అధికారులు

తొండంగి,జూన్19: గత పది రోజులుగా డయేరియా వ్యాధి తీవ్రతతో తల్లడిల్లిన కాకినాడ జిల్లా తొండంగి మండలం కొమ్మనాపల్లి గ్రామం కోలుకుంది. బుధవారం ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. దీంతో వైద్యులు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటివరకు గ్రామంలో సుమారు వంద కేసుల వరకూ నమోదయ్యాయి. దీంతో గ్రామంలో బేస్ క్యాంపు ఏర్పాటు చేసి ప్రాథమిక చికిత్స అనంతరం అవసరమైన వారిని మూడు అంబులెన్స్‌ల ద్వారా యుద్ధ ప్రాతిపదికన జీజీహెచ్‌కు తరలించేవారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డుల్లో రోగులకు చికిత్స అందించారు. డీఎంహెచ్‌వో నర్సింహనాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సరిత తదితర ఉన్నతాధికారుల పర్యవేక్షణలో డాక్టర్ రవికుమార్ డాక్టర్ భారతి రోగులకు నిరంతరాయంగా చికిత్స అందించారు. జిల్లా పంచాయతీ అధికారితో పాటు ఆర్‌డబ్ల్యూఈఎస్ ఎస్ఈ శ్రీనివాసరావు తదితరులు గ్రామంలో పారిశుధ్య నిర్వహణను పర్యవేక్షించారు. ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా తదితర అంశాలను పర్యవేక్షించి ఆదేశాలు ఇవ్వడంతో ఆ రెండు అంశాలలో ఉన్న లోటుపాట్లు సరి అయ్యాయి. శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు ఎప్పటికప్పుడు జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించడంతో జిల్లా యంత్రాంగం మొత్తం అప్రమత్తమై మెరుగైన సేవలు అందించింది.

### బెండపూడిలో డయేరియా కేసులు

కొమ్మనాపల్లిలో ఒకపక్క కేసులు తగ్గగా మరోపక్క బెండపూడిలో కేసులు నమోదు కావడంతో ఆందోళన చెందుతున్నారు. మొదటి రోజు 18 కేసులు నమోదుకాగా రెండో రోజు 12 కేసులు నమోదయ్యాయి. తుని ఏరియా ఆసుపత్రికి నలుగురిని పంపించగా మరో నలుగురు అక్కడ చేరారు. మరో నలుగురికి స్థానికంగా చికిత్స అందించారు. డీఎంహెచ్‌వో నర్సింహనాయక్, డీఎల్‌పీవో బాలామణి గ్రామాన్ని సందర్శించి వ్యాధి వ్యాప్తికి కారణంగా చెప్తున్న రెండు బావులను మూయించివేశారు. ఓహెచ్‌ఆర్ ట్యాంకు నీటిని కూడా ఆపివేసి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టారు.పైపులీక్‌లను అరికట్టేందుకు సిబ్బందికి సూచనలు చేశారు. రోగులకు అందుతున్న వైద్య సహాయాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. మలేరియా అధికారి భాస్కరరావు వైద్యాధికారులు కె.అర్చన, ఆర్.లలిత, ఎంహెచ్‌వో రవికుమార్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

### బాధితులను పరామర్శించిన టీడీపీ నేతలు

స్థానిక ఎమ్మెల్యే యనమల దివ్య ఆదేశాల మేరకు సీనియర్ టీడీపీ నేతలు యనమల రాజేష్, సుర్ల లోవరాజు బుధవారం బాధితులను పరామర్శించారు. వైద్య సహాయాన్ని అడిగి తెలుసుకున్నారు. శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు, శాసన సభ్యురాలు యనమల దివ్య అధికారులకు అవసరమైన సూచనలు చేశారని రోగులు ధైర్యంగా ఉండాలని తెలిపారు. వారి వెంట సాధనాల నూకరాజు తదితరులు ఉన్నారు.



బాధితుడిని పరామర్శిస్తున్న యనమల రాజేష్ తదితరులు

# నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం


చెక్కు అందిస్తున్న దాతలు

అన్నవరం, జూన్ 19: రత్నగిరిపై ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి బుధవారం కాకినాడకు చెందిన వెంకటేశ్వరప్రసాద్, జ్యోతిశ్రీ దంపతులు లక్ష రూపాయలు విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని దాత ఆలయ సూపరింటెండెంట్ స్వామీజీకి అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆయన అభినందించి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో ఏపీఆర్వో ఎం.గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.


చక్రస్నానం నిర్వహిస్తున్న దృశ్యం

# వైభవంగా బాలబాలాజీ స్వామి చక్రస్నాన మహోత్సవం

మామిడికుదురు, జూన్ 19: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు స్వామివారికి వైనతేయ నదిలో చక్ర స్నానాన్ని వైభవంగా నిర్వహించారు. నాలుగో రోజు జ్యేష్ఠ శుద్ధ బుధవారం సుప్రభాతసేవ, నిత్యార్చన, సహస్ర నామార్చన, బాలబోగ నివేదన, నిత్య హోమం, బలిహరణ, తీర్థ ప్రసాద గోష్ఠి, చతుష్టానార్చనలు, వేద పారాయణం, హోమం మంగళాశాసన, మహా పూర్ణాహుతి , బలిహరణ తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని భారీ ఊరేగింపు నడుమ వైనతేయ నది వరకు తీసుకువెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల కోలాహలం నడుమ స్వామివారి ప్రతిమను అర్చకులు శిరస్సున ధరించి స్వామి వారికి చక్రస్నానాన్ని ఆచరింప చేశారు. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ సహాయ కమిషనర్ జి.మాధవి పర్యవేక్షణలో అర్చకుడు చలమచర్ల కృష్ణమాచార్యులు, గొడవర్తి శ్రీనివాసాచార్యులు నిర్వహించారు.


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు

### హ్యాండ్లూమ్ టెక్నాలజీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 19: తిరుపతి జిల్లా వెంకటగిరిలోని శ్రీప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ కళాశాలలో హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎస్‌పీకేయం ఐఐహెచ్‌టీ ఓఎస్‌డీ ఎస్.గిరిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు రెండు, మూడేళ్ల ఈ కోర్సులో ప్రవేశానికి ఈ నెల 20న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని చెప్పారు. వివరాలకు 9441795408, 9866169908, 9010243054 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

### దుర్గాడలో డయేరియా?

గొల్లప్రోలు రూరల్, జూన్ 19: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామంలో డయేరియా జాడలు కనిపిస్తున్నాయి. గ్రామానికి చెందిన అయిదు సంవత్సరాల పాప వాంతులు విరోచనాలతో బాధపడుతూ ఉండటంతో తొలుత పిఠాపురం సీహెచ్‌సీకి అక్కడ నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనితో అప్రమత్తమయిన వైద్య సిబ్బంది ఆ ప్రాంతంలో ఇంటింటా సర్వైలెన్స్ నిర్వహించారు. మిగిలిన వారికి ఎటువంటి లక్షణాలు లేవని గుర్తించామని వారు తెలిపారు. మంచినీటి శాంపిల్స్ సేకరించారు.


సప్తనదుల జలాలను చూపిస్తున్న అర్చకులు

# రేపు సప్తనదీ జ్యేష్ఠాభిషేకం

అంతర్వేది, జూన్ 19: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం స్వామివారికి సప్తనదీ జలాలతో జ్యేష్ఠ మహాభిషేకం జరుగుతుందని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. ఈ మహా జ్యేష్ఠాభిషేకానికి ఇతర రాష్ట్రాల్లో ఉన్న సప్త నదుల నుంచి సేకరించిన జలాలను ఆలయంలో బుధవారం అర్చకుల సమక్షంలో భద్రపర్చామన్నారు. శుక్రవారం జరిగే మహాజ్యేష్ఠాభిషేకంలో భక్తులు పాల్గొనడానికి ఆలయం వద్ద రూ.400 టిక్కెట్‌ను తీసుకోవాలన్నారు. ఉదయం 5.30గంటలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, 9 గంటలకు మూలవరులకు సప్త నదీ జలాలతో మహా జ్యేష్ఠాభిషేకం నిర్వహించిన అనంతరం మహాశాంతి హోమం జరుగుతుందని ఆలయ అర్చకులు తెలిపారు.

# సికిల్ సెల్ ఎనీమియా అంటువ్యాధి కాదు

**రాజమహేంద్రవరం జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు**


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 19: సికిల్ సెల్ ఎనీమియా(కొండవలి కణ రక్తహీనత) అంటువ్యాధి కాదని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు గ్రామంలో ట్రైబల్ వెల్ఫేర్ బాలికల ఉన్నత పాఠశాలలో సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.వెంకటేశ్వరావు మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి కేవలం జన్యుపరంగా తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన గ్రామాల్లో 45 ఏళ్ల లోపు ఉన్న వారికి అవగాహన కల్పించి, సార్వత్రిక నిర్ధారణ పరీక్షలు కౌన్సిలింగ్ ద్వారా ఈ వ్యాధిని అరికట్టడానికి ప్రణాళిక రచించిందన్నారు. జిల్లా ఆర్‌బీఎస్‌కె ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ హరిచంద్ర మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి వారసత్వంగా వచ్చిన ఎర్ర రక్తకణాల రుగ్మతల సమూహమని రక్తంలో హెమోగ్లోబిన్ ఉత్పత్తికి కారణమయ్యే జన్యువులు లోపబలిష్టంగా మారుతాయని తెలిపారు. ఆక్సిజన్ శాతం తక్కువగా ఉన్న ప్రాంతాలలో హెమోగ్లోబిన్ కొడవలి కణాలుగా మారి తద్వారా ఏ భాగంలో నైనా కణజాలం మారడం వలన రక్తహీనత పరిస్థితులకు దారి తీస్తుందని చెప్పారు. అనంతరం జిల్లా గిరిజన సంక్షేమాధికారి కేఎన్ జ్యోతి, డీపీఎంయూ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ అభిషేక్ రెడ్డి జిల్లా ఎపిడమాలజిస్ట్ సుధీర్ బాబు మాట్లాడారు. వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం వినియోగం, తరచు నీళ్లు తాగడంపై అవగాహన కల్పించారు. కళ్లు పసుపుగా మారడం, తీవ్రమైన ఒళ్ళు నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడటం ఈ వ్యాధి లక్షణమని తెలిపారు. గర్భాధారణ సమయంలో సమస్యలు వస్తే అవయవనష్టం కలగవచ్చని తెలిపారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ వ్యాధి నిర్ధారించడానికి ఎలక్ట్రోఫోరోసిస్ అనే రక్త పరీక్ష ద్వారా మాత్రమే నిర్ధారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాల హెడ్ మిస్ట్రస్ బి.సీత, డిప్యూటీ వార్డెన్ బి.కద్రమ్మ, పీడీ జి.చిన్నారావు, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కడియపులంకలో చోరీ

**10 కాసుల బంగారం, రూ.లక్ష అపహరణ**


ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

కడియం, జూన్ 19: కడియపులంకలో భారీ చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కడియపులంక గ్రామానికి చెందిన కర్రి వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం రాత్రి సమీపంలో ఉన్న అత్తారింటికి వెళ్లారు. ఈ సమయంలో వెంకటేశ్వరరావు ఇంటి తాళాలు బద్దలుగొట్టి బెడ్‌రూమ్‌లో ఉన్న బీరువాను పగలకొట్టి అందులో ఉన్న 10 కాసుల బంగారు ఆభరణాలు, వెండి, రూ.లక్ష నగదు కాజేశారు. ఉదయం వెంకటేశ్వరరావు వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు బద్దలు గొట్టి ఉన్నట్లు, బీరువా తెరచి ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, సీఐ తులసీధర్, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు సీఐ తులసీధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కడియంలో జరిగిన మండల పరిషత్ సమావేశానికి వచ్చిన రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి విషయం తెలియడంతో కడియపులంక వెళ్లారు. వెంకటేశ్వరరావు సోదరుడు ఎస్సయ్యతో మాట్లాడారు. నిందితులను పట్టుకుని బంగారం, వెండితో పాటు నగదును కూడా రికవరీ చేసి వెంకటేశ్వరరావుకు న్యాయం చేయాలని పోలీసులకు చెప్పినట్లు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు.


సంబరాలు చేసుకుంటున్న జనసేన నాయకులు

# జనసేన సంబరాలు

అమలాపురం టౌన్, జూన్ 19: ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా పవన్‌కల్యాణ్ బుధవారం బాధ్యతలు చేపట్టడంతో జనసేన నాయకులు, కార్యకర్తలు అమలాపురం గడియార స్తంభం సెంటర్లో సంబరాలు నిర్వహించారు. పవన్‌కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాష్ట్రంలో ఇక నుంచి ప్రజా పాలన సాగుతుందని నాయకులు లింగోలు పండు, యేడిద శ్రీను, ఇసుకపట్ల రఘుబాబు, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో నాయకులు పిండి రాజా, ఆకుల బుజ్జి, నల్లా వెంకటేశ్వరరావు, కొప్పుల నాగమానస, తిక్కా సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

**జాతీయ రహదారి అలైన్‌మెంట్‌కు వ్యతిరేకంగా**

# బాధితుల ఆందోళన


ఆందోళన నిర్వహిస్తున్న బాధితులు

మామిడికుదురు, జూన్ 19: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పాశర్లపూడిలో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా నిర్వహిస్తున్న బైపాస్ రోడ్డు పనులను బుధవారం స్థానికులు అడ్డుకుని నిరసన చేపట్టారు. రెవెన్యూ అధికారులు 2014లో సర్వే చేసి దాని ప్రకారం రోడ్డు వేయకుండా కొంతమంది పెద్దల పలుకుబడి వల్ల అలైన్‌మెంట్ మార్చి పేదల భూముల్లో నుంచి బైపాస్ రోడ్డు ఏర్పాటు చేస్తున్నారని నిరసన తెలిపారు. అలైన్‌మెంట్ మార్చడం వల్ల చిన్న, సన్నకారు రైతులు తమకున్న కొద్దిపాటి భూమిని కోల్పోవలసి వస్తుందని వాపోయారు. పాత అలైన్‌మెంట్ ప్రకారం రోడ్డు వేయాలని జాతీయ రహదారిపై ఆందోళన చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఎన్‌హెచ్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించకపోవడంతో నేరుగా రాష్ట్రపతి ద్రౌపదీముర్మకు అర్జీ పెట్టుకుంటున్నట్టు బాధిత రైతులు తెలియచేశారు. రాష్ట్రపతి వెంటనే స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని అర్జీ ద్వారా వేడుకున్నారు. కార్యక్రమంలో స్థానిక రైతులు, మహిళలు పాల్గొన్నారు.

**అధిక సంఖ్యలో కేసుల పరిష్కారానికి**

# చర్యలు తీసుకోవాలి

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత**


సమావేశం నిర్వహిస్తున్న గంధం సునీత

రాజమహేంద్రవరం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న రాజీకి యోగ్యమైన కేసులు అధిక మొత్తంలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. ఈ మేరకు ఆయా జిల్లాల ఎస్పీలతో బుధవారం సమావేశమై పలు సూచనలు చేశారు. సివిల్, క్రిమినల్, ప్రీ-లిటిగేషన్ కేసులతో పాటు అదనపు జిల్లా న్యాయస్థానాల్లోని మోటారు వాహనాల ప్రమాదాల కేసుల్లోని బాధితులకు తగు పరిహారం అందించడంలో ప్రత్యేక చొరవ చూపాలన్నారు. అలాగే బార్ అసోసియేషన్ల అధ్యక్షులతో కూడా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్పీలు పి.జగదీశ్, ఎస్.సతీశ్ కుమార్, ఏ.జగదీశ్, ఎస్.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన నిర్వహిస్తున్న యువతి

# ప్రియుడి ఇంటి ముందు యువతి ఆందోళన

కొత్తపల్లి, జూన్ 19: ప్రేమించి పెళ్లి చేసుకొంటానని మాయమాటలు చెప్పి పెళ్లి మాటకొస్తే ముఖం చాటేస్తున్న ప్రియుని ఇంటి ముందు ప్రియురాలు బుధవారం ఆందోళన ప్రారంభించింది. బాధితురాలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపల్లి మండలం పాత ఇసుకపల్లి గ్రామానికి చెందిన ఎ.నవీన్‌కుమార్ అదే గ్రామానికి చెందిన పి.మానసను ప్రేమించి పెళ్లి చేసుకొంటానని హామీ ఇచ్చాడు. గత నాలుగు సంవత్సరాలుగా కలిసి తిరిగామని, ఇంకెంత కాలం పెళ్లి చేసుకోకుండా ఉంటామని తక్షణమే పెళ్లి చేసుకోవాలని యువతి ప్రియుడు కుమార్‌పై ఒత్తిడి తీసుకొచ్చింది. దీంతో కుమార్ ఇంట్లో పెద్దలు పెళ్లికి అంగీకరించడం లేదని హైదరాబాద్ వెళ్లిపోయాడని యువతి తెలిపింది. పెద్దల సమక్షంలో ఏప్రిల్ నెలలో నిశ్చితార్థం అయినా సరే హైదరాబాద్ వెళ్లి తిరిగి రాలేదని, ఇచ్చినమాట తప్పి తనను మోసం చేసి తప్పించుకొని తిరుగుతున్న కుమార్ పెళ్లి చేసుకొనే వరకు పోరాటం చేస్తానని, పెళ్లి చేసుకోకపోతే ప్రాణత్యాగం చేస్తానని యువతి ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో ఇరువర్గాల పెద్దలు కొత్తపల్లి పోలీసులను ఆశ్రయించడంతో చర్యలు చేపట్టారు.

# అనుమానం పెనుభూతమై..

**● భార్యను హతమార్చిన భర్త ● కాకినాడ రూరల్ హార్బర్ పేట హత్య కేసు ఛేదన**



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

సర్పవరం జంక్షన్, జూన్ 19: కాకినాడ రూరల్ హార్బర్‌పేటలో సంచలనం రేకెత్తించిన వివాహిత హత్య కేసును పోలీసులు ఛేదించారు. భార్యపై ఉన్న అనుమానం పెనుభూతంగా మారడంతో పాటు అప్పులు తీర్చేందుకు నగలు ఇవ్వడానికి నిరాకరించడంతో ఈ హత్యకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. అరెస్ట్ వివరాలను బుధవారం సర్పవరం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్ వివరించారు. కాకినాడ రూరల్ హార్బర్‌పేటలో నివాసం ఉంటున్న ఓలేటి నరసింహమూర్తి భార్య ఓలేటి సీత (26)ను ఈనెల 16వ తేదీన రాయితో కొట్టి హత్యకు పాల్పడ్డాడు. అయితే తప్పించుకునేందుకు తన భార్య ఒంటిపై ఉన్న పుస్తెలతాడు, చెవి దిద్దులు కోసం ఎవరో హత్య చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే సీత తల్లి మాత్రం అల్లుడే డబ్బుల కోసం తమ కుమార్తెను హత్య చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కాకినాడ ఎస్‌డీపీవో హనుమంతరావు ఆధ్వర్యంలో ఎస్‌హెచ్‌వో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. భర్తే సీతను హత్య చేసినట్లు పోలీసులు దర్యాప్తులో తేల్చి నిందితుడ్ని అరెస్ట్ చేశారు. ఓలేటి నరసింహమూర్తికి ఎనిమిదేళ్ల కిందట సీతతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. సీత వలసపాకల రొయ్యల కంపెనీలో పనిచేస్తోంది. భర్త కాకినాడ పోర్టులో సెక్యూరిటీగా పని చేస్తున్నాడు. భార్యపై అనుమానంతో గత రెండు నెలలుగా వేధింపులకు పాల్పడుతూ ఇతరులతో వివాహేతర సంబంధం అంటకట్టి వేధించేవాడు. రూ. 3.50 లక్షలు అప్పుచేసి వైసీపీపై బెట్టింగ్ కాయగా, డబ్బులు పోయాయి. దాంతో డబ్బుల కోసం భార్య ఒంటిపై ఉన్న బంగారు వస్తువులు ఇమ్మని వేధించాడు. ఈ విషయమై భార్యాభర్తల నడుమ వాగ్వాదం చోటుచేసుకుంది. ఈనెల 16న ఉదయం 6.30 గంటలకు సీతను ఎవరో తలపై కొట్టి హత్యచేసి బంగారు వస్తువులను పట్టుకుపోయారని తల్లికి సమాచారం రావడంతో వెళ్లి చూడగా కుమార్తె తలపై రక్తంతో ఉండటం, బంగారు వస్తువులు కనిపించలేదు. తన కుమార్తెను అల్లుడే హత్య చేశాడని అనుమానం వ్యక్తంచేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఎస్‌డీపీవో హనుమంతరావు పర్యవేక్షణలో సర్పవరం ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్, సీఐ ఎ.సన్యాసిరావు, పోర్టు ఎస్‌హెచ్‌వో వి.సుమంత్ దర్యాప్తు చేశారు. భర్త నరసింహమూర్తి భార్యను హత్య చేసినట్లు గుర్తించి బుధవారం హార్బర్‌పేటలో అరెస్ట్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. భార్య హత్యకు ఉపయోగించిన రక్తపు మరకలు కలిగిన రాయి, బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం స్పెషల్ మొబైల్ కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు.

## ఏజెన్సీ సమాచారం

# డిమాండ్ నేపథ్యంలో విద్యుదుత్పత్తి పెంపుదల

**ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ జవహర్**



మోతుగూడెం, జూన్19: రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ అధికంగా ఉన్న నేపథ్యంలో గ్రిడ్ అధికారుల ఆదేశాల మేరకు పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తిని మంగళవారం నుంచి పెంచుతున్నట్లు ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ కె.జవహర్ తెలిపారు. జెన్కో కార్యాలయంలో ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ విద్యుదుత్పత్తి కోసం డొంకరాయి పవన్ కెనాల్‌లోకి 12 అడుగులకు మంగళవారం నుంచి నీటి విడుదలను పెంచామన్నారు. ప్రస్తుతం కెనాల్ నుంచి ఫోర్‌బైకు 3,888 క్యూసెక్కుల నీరు వెళుతుందని ఆయన తెలిపారు. డొంకరాయి పవర్ కెనాల్ మరమ్మతుల అనంతరం ఈ నెల 10వ తేదీ నుంచి డొంకరాయి జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తిని ప్రారంభించి కెనాల్‌లోకి నీటిని విడుదల చేశామన్నారు. పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో ఇప్పటి వరకు రెండు యూ నిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని, గ్రిడ్ డిమాండ్ నేపథ్యంలో మరో యూనిట్‌ను కూడా వినియోగంలోకి తీసుకువస్తున్నామని ఆయన తెలిపారు.

### బలిమెల నుంచి అదనపు నీరు

సీలేరు కాంప్లెక్సు జల విద్యుత్ కేంద్రాలకు నీరందించే బలిమెల జలాశయం నుంచి ఆంధ్రా వాటాగా ప్రస్తుతం 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అయితే ఆంధ్రాలో విద్యుత్ డిమాండ్ అధికంగా ఉండడంతో పాటు ఇతర జలాశయాల్లో నీటి నిల్వలు అడుగంటిన నేపథ్యంలో సీలేరు కాంప్లెక్సు నుంచి విద్యుత్ ఉత్పత్తిని పెంచాలన్న గ్రిడ్ అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం బలిమెల జలాశయం నుంచి ఆంధ్రావాటాగా విడుదల అవుతున్న 1500 క్యూసెక్కుల నీటిని 3వేల క్యూసెక్కులకు పెంచాలని ఒడిశా అధికారులను కోరడంతో మంగళవారం నుంచి 3వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ఈ నీటితో సీలేరు, డొంకరాయి, పొల్లూరు, మూడు జల విద్యుత్ కేంద్రాల్లో పీక్‌లోడ్ అవర్స్‌లో గ్రిడ్ అధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ ఉత్పత్తిని చేస్తామని జెన్కో ఎస్ఈ తెలిపారు. సీలేరు కాంప్లెక్సులోని డొంకరాయి జలశయంలో 5 టీఎంసీలు, బలిమెలలో ఏపీ వాటాగా 5 టీఎంసీలు కలిసి 10 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయని జవహర్ తెలిపారు.

## ఎమ్మెల్యేతో మర్యాదపూర్వక భేటీ


ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

మోతుగూడెం, జూన్19: రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషను, ఆమె భర్త రంపచోడవరం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మఠం భాస్కర్‌ను మోతుగూడెం, డొంకరాయి ఎంపీటీసీ కరకా వెంకటరమణ, వేగి నాగేశ్వరరావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. టీడీపీ కార్యకర్తలు దొరబాబు, అంగఎను, పోలయ్య, గౌతం, భీమరాజు, పాసి రమణ, డొంకరాయి టీడీపీ నాయకులు నీలాపు సత్యనారాయణ, మావూరి సత్యనారాయణ, కరకా ప్రేమ్‌కిరణ్, గంగిరెడ్ల అనిల్, దుంగారాజు, గుంపెన శివ, డొంకరాయి జనసేన నాయకులు కీముడు మూర్తి పాల్గొన్నారు.

## ‘కూటమి ప్రభుత్వం.. గిరిజన ఉద్యోగులకు అనుకూలం’


జోగారావు

కూనవరం, జూన్ 19: కూటమి ప్రభుత్వం గిరిజన ఉద్యోగుల పట్ల సానుకూలంగా వ్యవహరిస్తోందని గిరిజన ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తుష్టి జోగారావు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రమాణస్వీకారం చేపట్టి ఏజెన్సీలో ఉన్న సుమారు 543 ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో ఉండి చదువుతున్న పిల్లల ఆరోగ్యంపై దృష్టిపెట్టిందన్నారు. ఈ వసతి గృహాల్లో తక్షణమే ఏఎన్‌ఎంలు నియమించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమన్నారు. 2014-2019 టీడీపీ ప్రభుత్వంలో వందలాది మంది ఏఎన్‌ఎంలు నియమించిన ఘతన టీడీపీకే దక్కుతుందని వైసీపీ వచ్చాక వారిని తొలగించారని అన్నారు.

## సిమెంట్ రేకులు, ఇనుప పైపుల వితరణ


సిమెంట్ రేకులను వితరణ చేస్తున్న జమాల్‌ఖాన్

వరరామచంద్రాపురం, జూన్ 19: ఇటీవల గాలి,వాన బీభత్సానికి ఇళ్లు కోల్పోయిన బాధితులకు ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్‌ఖాన్ అండగా నిలిచారు. మూడు రోజుల క్రితం గాలి,వాన బీభత్సం సృష్టించడంతో మండల పరిధిలోని రాజుపేట, వడ్డిగూడెం గ్రామాల్లోని 17 కుటుంబాల వారికి సంబంధించిన ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. విషయం తెలుసుకున్న జమాల్‌ఖాన్ ఆ గ్రామాల్లో పర్యటించి బాధితులతో మాట్లాడి జె.కె.సి.టి ట్రస్టు ద్వారా 85000 వేల రూపాయలు విలువ చేసే సిమెంట్ రేకులు, ఇనుప పైపులను బాధిత కుటుంబాలకు తహశీల్దార్ సయ్యద్ మౌలానాఫాజిల్, టీడీపీ నాయకుల సమక్షంలో అందచేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు వాళ్ల రంగారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు ఆచంటి శ్రీనివాసరావు, టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ జడ్పీటీసీ ముత్యాల రామారావు, టీడీపీ నాయకులు బీరక సూర్యప్రకాష్‌రావు, బొర్ర నరేష్‌కుమార్, ముత్యాల సిద్ధు, బొర్ర ఆదినారాయణ, బొర్ర సూరి, జనసేన, బిజెపి మండల నాయకులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో 88శాతం ఉత్తీర్ణత

కోరుకొండ, జూన్ 19: కోరుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటీవల జరిగిన సప్లిమెంటరీ పరీక్షల్లో 88శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ ఐ.శారద తెలిపారు. ఇటీవల జరిగిన పరీక్షల్లో 83 మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలు రాయగా 73 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఒకేషనల్ విభాగంలో 24 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 20 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఎస్.రామచంద్రరావు, కేవీఆర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా ఇసుక, మట్టి తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు

**● ఎమ్మెల్యే విజేత బత్తుల బలరామకృష్ణ**


తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే విజేత బత్తుల

కోరుకొండ, జూన్ 19 : ప్రభుత్వ ఇసుక విధానం అమల్లోకి వచ్చేంత వరకు రాజానగరం నియోజకవర్గం పరిధిలోని కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాల్లో ఎక్కడైనా ఇసుక, మట్టి తవ్వకాలు జరిపితే కఠినచర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ హెచ్చరించారు. ఈమేరకు బుధవారం తన కార్యాలయంలో 3 మండలాల తహసీల్దార్‌లు, రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. 22ఏ భూములు, బి పట్టాభూములు, సీలింగ్‌భూముల వివరాలు సమస్త నివేదిక అందించాలని అధికారులను కోరారు. ప్రభుత్వ, దేవాలయ భూములను పరిరక్షించాలన్నారు. ఇళ్ల స్థలాలు లబ్ధిదారులకు సంబంధించి అర్హులైన జాబితా తయారు చేయాలన్నారు. బూరుగుపూడి ఆవ భూములకు సంబంధించి 586 ఎకరాలకు సంబంధించి సమగ్ర సమాచారం అందించాలని తహసీల్దార్‌లను కోరారు. ఇళ్ల పట్టాలు ఇచ్చిన వారి జాబితా,. దరఖాస్తు చేసుకున్న వారి జాబితా తనకు ఇవ్వాలన్నారు. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు, ప్రస్తుత స్థితిగతులపై ఆరా తీశారు. రాజానగరం కోరుకొండ, సీతానగరం తహసీల్దార్‌లతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పారదర్శకమైన విధానాలతో ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై సమీక్షించారు. ప్రజాసంక్షేమ, అభివృద్ధే ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వం ఇసుకపై ఏ విధమైన నిర్దిష్టమైన విధానాన్ని ఇంకా ప్రకటించలేదన్నారు. ప్రభుత్వ విధానం అమల్లోకి వచ్చేంత వరకు ఏ విధమైన ఇసుక తవ్వకాలు, రవాణా జరగకూడదన్నారు. ఇసుక, మట్టి తవ్వకాలు అడ్డగోలుగా సాగించే వారిపై అధికారులు చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాజానగరం నియోజకవర్గంలో సుమారు రూ.20.34కోట్లతో 104 ఎకరాల్లో ఇండస్ట్రీయల్ పార్కు ఏర్పాటుకు ఏ విధమైన చర్యలు తీసుకోవాలో అధికారులకు సూచించారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా తమ ప్రణాళిక సిద్ధం చేయాల’ని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌రమణా రెడ్డిని ఆదేశించారు. ఈ సమావేశంలో కోరుకొండ తహసీల్దార్ రాజ్యలక్ష్మి, సీతానగరం తహసీల్దార్ నెల్సన్‌పాల్, రాజానగరం తహసీల్దార్ అబ్దుర్ రెహ్మాన్, డిప్యూటీ తహసీల్దార్ నరేష్, జనార్ధన్, రాజశేఖర్, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామస్థాయి నుంచి సీపీఐ పార్టీ బలోపేతం

**● సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు**


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 19 : గ్రామస్థాయి నుంచి సీపీఐ పార్టీని సంస్థాగతంగా నిర్మించుకుంటూ పార్టీని బలోపేతం చేద్దామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు పార్టీ కేడర్‌కు పిలుపునిచ్చారు. బుధవారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం నగర కార్యదర్శి కొండలరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ జులై 1, 2, 3 తేదీల్లో సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు ప్రారంభమవుతున్నాయని, ఈ సమావేశంలో పార్లమెంట్, శాసనసభ ఎన్నికల సమీక్ష, పార్టీ ప్రజాసంఘాల నిర్మాణం తదితర అంశాలపై నివేదికలు ప్రవేశపెడుతున్నారని అన్నారు. ఇందులో భాగంగా తూర్పుగోదావరి జిల్లా పార్టీ నిర్మాణం, ప్రజాసంఘాల అంశాలు చర్చించి జిల్లా కార్యవర్గం ఒక డాక్యుమెంట్‌ను ప్రవేశపెడుతుందని అన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అవన్నీ అమలు చేసే వరకూ తాము ప్రశ్నిస్తామని అన్నారు. కేంద్రం నుంచి నిధులు తెచ్చి పోలవరం పూర్తి చేస్తే చంద్రబాబు అపరభగీరధుడిగా చరిత్రలో నిలిచిపోతారని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు కుండ్రపు రాంబాబు, రేఖ భాస్కరరావు, జిల్లా కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

## టీడీపీ నేతల సమావేశం

కోరుకొండ, జూన్ 19: కోరుకొండ మండలం బూరుగుపూడి గేటు వద్ద గల టీడీపీ కార్యాలయంలో ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణచౌదరి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బత్తుల బలరామకృష్ణ, బొడ్డు వెంకటరమణ చౌదరిని కలిసి కూటమి అఖండ విజయానికి సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. పలువురు సీనియర్ టీడీపీ నాయకులు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కంటే నాగ కేశవరావు, తనకాల నాగేశ్వరరావు, గంగిశెట్టి సత్తిబాబు, తదితరులు బొడ్డు సేవలను కొనియాడారు. ప్రోటోకాల్‌తో కూడిన పదవిని బొడ్డుకు కేటాయించాలని పార్టీ నాయకులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అడపా వీరబాబు, కాండ్రేగుల కృష్ణ, మాజీజడ్పీటీసీ మళ్ళ అప్పల నర్సారావు, నర్సాపురం ఎంపీటీసీ పీతా శ్రీను, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కడియపులంక మాజీ సర్పంచ్ మాణిక్యం మృతి



కడియం, జూన్ 19: కడియపులంక మాజీ సర్పంచ్ పుల్లా మాణిక్యం (93) వృద్ధాప్యంతో మృతి చెందారు. మాణిక్యం 2001 నుంచి 2006 వరకు కడియపులంక సర్పంచ్‌గా పదవిలో ఉన్నారు. ఈమెకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నలుగురు కుమారుల్లో ఒకరైన పుల్లా రామారావు కూడా కడియపులంక సర్పంచ్‌గా పదవి చేపట్టారు. మిగిలిన ముగ్గురు నర్సరీ రంగంలో స్థిరపడ్డారు. మాతృవియోగం పొందిన పుల్లా రామారావును మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ సర్పంచ్ గట్టి నర్సయ్య ప్రస్తుత సర్పంచ్-ఇన్‌చార్జి పాటంశెట్టి రాంజీ, పలువురు నర్సరీ రైతులు, ఎంపీటీసీలు పరామర్శించి వారి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# జగ్గంపేట నియోజకవర్గం మరింత అభివృద్ధి

**● ఎమ్మెల్యే విజేత నెహ్రూకు శుభాకాంక్షలు**


ఎమ్మెల్యే నెహ్రూకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎలక్ట్రికల్ యూనియన్ సభ్యులు

గోకవరం, జూన్ 19: జగ్గంపేట ఎమ్మెల్యే విజేత జ్యోతుల నెహ్రూ గెలుపుతో జగ్గంపేట నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతు ందని గోకవరం ఎలక్ట్రికల్ యూనియన్ సభ్యులు అన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించిన నెహ్రూ ను బుధవారం స్థానిక మాజీ జడ్పీటీసీ పాలూరి బోస్ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ యూనియన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి శుభా కాంక్షలు తెలియజేసి ఘనంగా సత్కరించారు.

## అదృశ్యమైన మహిళ ఆచూకీ లభ్యం

**● ఊపిరి పీల్చుకున్న కుటుంబ సభ్యులు**

రాజానగరం, జూన్ 19: మండలంలోని తూర్పుగోనగూడెం గ్రా మంలో గత మూడు రోజుల కిందట అదృశ్యమైన మహిళ గళ్లా భవాని ఆచూకీ బుధవారం లభించింది. తోటి కోడలు ఆకస్మిక మృతితో మానసిక ఆందోళనతో ఈనెల 17న తెల్లవారుజామున ఇంటి నుంచి అదృశ్యమైన విషయం తెల్సిందే. అప్పటి నుంచి తల్లి ఆచూకీ కోసం తల్లడిల్లిన కుమార్తెలు, కుటుంబ సభ్యులు కంటిమీద కునుకు లేకుండా గడిపారు. తల్లి అచూకీ కోసం కుటుంబ సభ్యులు, బంధు వులు, పోలీసులు ముమ్మరంగా గాలించినప్పటికీ ఫలితం లేకపోవడంతో మంగళవారం రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో బుధవారం గండేపల్లి మండలం మురారిలో ఉన్నట్లుగా సమాచారం అందడంతో కుమార్తెలు శ్రావణి, దేవి మురారి చేరుకుని తల్లిని వెంటబెట్టుకుని ఇంటికి తీసుకొచ్చారు. తల్లి క్షేమంగా ఇంటికి చేరడంతో అటు కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

## సుబ్రహ్మణ్యస్వామి ఆలయ పునః నిర్మాణానికి కోసూరి కుటుంబం రూ.1.01 లక్షలు విరాళం

కోరుకొండ, జూన్19: కోరుకొండ శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పునః నిర్మాణానికి గ్రామానికి చెందిన కోసూరి చిన్నారావు వారి తల్లిదండ్రులు జ్ఞాపకార్థం రూ.1,01116లు విరాళాన్ని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ కమిటీకి అందజేశారు. ఆదేవిధంగా బొరుసు త్రిమూర్తులు, నాగమణి దంపతులు బొరుసు బద్రినారాయణ, దుర్గ దంపతులు రూ.10,116లు విరాళంగా అందజేశారని ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోసూరి చిన్నారావు,వీరేష్, కేతినీడిఅశోక్, దూలంపెద్ద, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత ఇసుక విధానం అమలుచేయాలి

**● డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు మాచరయ్య**

దివాన్‌చెరువు, జూన్ 19: రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానంను తక్షణం అమలులోకి తీసుకురావాలని డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు యాళ్ల మాచరయ్య ఎన్డీఏ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండలంలోని కొత్తతుంగపాడులో బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మూడు యూనిట్లు ఇసుక ధర దాదాపు రూ.24 వేలకు చేరగా ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పుడు ఆ ధర రూ.16 వేలకు దిగిందని తెలిపారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గతంలోవలే మరలా ఉచిత ఇసుక విధానంను అమలులోకి తీసుకురావాలని కోరారు. ఆవిధంగా చేస్తే గృహ నిర్మాణాలు చేసుకునే సామాన్య మధ్య తరగతి వర్గాలవారికి ఎంతో ఊరట లభిస్తుందని అన్నారు.

## ఉత్తమ విద్యార్థికి ఆర్థిక సాయం అందజేత

రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 19: గురుకుల పాఠశాల నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరచి, ప్రథమ స్థానంలో నిలిచిన పేద విద్యార్థి బి.సాయి వర్షిత్‌కు హెల్పింగ్ హేండ్స్ సంస్థ, ప్రవేశ ఫీజు నిమిత్తం తొమ్మిదివేల రూపాయలను ఆర్థిక సాయాన్ని ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎబెల్ రాజబాబు చెక్కును అందజేశారు. హెల్పింగ్ హేండ్స్ సభ్యులైన అర విందజైన్ మాట్లాడుతూ ఆరునెలల క్రితమే బి.సాయి వర్షిత్ తండ్రి మరణించాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో బేరాలాల్ జైన్, నాలం నరసింహారావు, బాలాజీ, గాదె కిషోర్ క్రీడా సైకాలజిస్టు సుంకర నాగేంద్ర కిశోర్, సీరా గంగాధర్, పీఏ కిషోర్ బాబు పాల్గొన్నారు.


పేద విద్యార్థికి ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

## బడిఈడు పిల్లలు తప్పక చదువుకోవాలి


కుసుమనాగన్న ప్రాథమిక పాఠశాలలో నేను బడికిపోతా కార్యక్రమం దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 19: బడి ఈడు పిల్లలు తప్పక చదువుకోవాలని రాజమహేంద్రవరం 35వ డివిజన్ మాజీ కార్పొరేటర్ కరగాని మాధవి అన్నారు. బుధవారం స్థానిక కోర్లంపేటలోని కుసుమ నాగన్న నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని సేవా రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నేనుబడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్లకార్డులను చిన్నారులు ప్రదర్శించారు. పిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బడిఈడు గల పిల్లలందరినీ స్కూల్స్‌లో చేర్పించి చదించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్థానిక పెద్దలు వేణు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు చీరలు, పండ్లు పంపిణీ



రాజమహేంద్రవరం సిటీ, జూన్ 19 : ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు, పార్లమెంట్‌లో ఇండియా కూటమి నేత రాహుల్‌గాంధీ పుట్టిన రోజుపురస్కరించుకుని రాజమహేంద్రవరంలో ఆ పార్టీ నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధరరావు స్థానిక వీరభద్రపురం సాదుస్త్రీల మఠం ఆశ్రమంలో బుధవారం వృద్ధులకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు చించినాడ వెంకటేశ్వరావు, మహిళా కాంగ్రెస్ నాయకులు ఎం.శారద, సీనియర్ నాయకులు కిశోర్‌కుమార్‌జైన్, యిజ్జరౌతు విజయలక్ష్మి, బత్తిన చంద్రరావు, ఐ.సత్యనారాయణ, రాజు, కాంగ్రెస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు బిల్డర్ బాబీ పాల్గొన్నారు.

# తొలగించిన డివైడర్ మూసివేత ఎప్పుడో?

**● పొంచి ఉన్న ప్రమాదం**


నన్నయ విశ్వవిద్యాలయం ఎదురుగా జాతీయరహదారిపై తొలగించిన డివైడర్

దివాన్‌చెరువు, జూన్ 19: జాతీయ రహదారిపై ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎదురుగా తొలగించిన రోడ్ డివైడర్‌ను మూసివేసే విషయంలో సంబంధితులు ఎందుకు జాప్యం చేస్తున్నారో అంతుచిక్కడంలేదు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలు పోలింగ్ ముగిసిన అనంతరం రాజమహేంద్రవరం లోక్‌సభతోపాటు జిల్లాలోని ఏడు శాసనసభానియోజకవర్గాలకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంను ఓట్లు లెక్కింపు కేంద్రంగా ఏర్పాటు చేసారు. దీనితో లెక్కింపుసిబ్బంది, అధికార్లు సౌలభ్యం కోసం ఆఘమేఘాలపై నన్నయ విశ్వవిద్యాలయం ఎదురుగా జాతీయరహదారిపై ఉన్న డివైడర్‌ను తొలగించారు. ఓట్లులెక్కింపు జరిగి రెండువారాలు అయినప్పటికీ ఇంతవరకూ ఈ డివైడర్‌ను మాత్రం మూసివేయలేదు. దీనితో రాజమహేంద్రవరం వైపు నుంచి చక్రద్వారబంధం మీదుగా రాధేయపాలెం, తుంగపాడు తదితరగ్రామాలకు వివిధపనులపై ద్విచక్రవాహనాలు, కార్లపై వెళ్లేవారు కొందరు డివైడర్ తొలగించిన చోటునుంచే తమవాహనాలతో రోడ్డుదాటుతున్నారు. సర్వీసు రోడ్ ఉన్నప్పటికీ ఇక్కడ అనువుగా ఉండడంతో ఇక్కడ మళ్లుతున్నారు. జాతీయరహదారి కావడంతోవాహనాలరాకపోకలతో నిత్యం ఈరహదారి రద్దీగా ఉంటుంది. దీనికితోడు రహదారి డౌనుగా ఉండడంతో రాజమహేంద్రవరం వైపు నుంచివచ్చే వాహనాలు వేగంగా ప్రయాణిస్తూ ఉంటాయి. అయితే ఎవరైనా ఇక్కడనుంచి రహదారిని దాటే సమయంలో వేగంగా వచ్చే వాహనాలను గమనించకపోతే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కావున తొలగించిన ఈ రోడ్ డివైడర్‌ను మూసివేసేందుకు అధికార్లు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## తానేటి వనిత అవినీతి అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి

**● లిబరేషన్ కాంగ్రెస్‌పార్టీ నాయకుడు బొంతా శ్యాంరవిప్రకాష్ డిమాండ్**

కొవ్వూరు, జూన్ 19 : మాజీ హోంమంత్రి తానేటి వనిత అవినీతి అక్ర మాలపై సీబీఐ విచారణ జరిపించాలని లిబరేషన్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు బొంతా శ్యాం రవిప్రకాష్ డిమాండ్ చేశారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని అనేకమంది వద్ద నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేశారని సీబీఐ విచారణ జరిపిస్తే వాస్తవాలు బయటికి వస్తాయన్నారు. ఆమెకు వ్యతిరేకంగా మాట్లాడేవారిపై అక్రమ కేసులు బనాయించేవారని, దళిత యువకుల హత్య కేసుల్లో బాధితులకు కనీసం న్యాయం జరగలేదని, పోలీసు నియామకాలలో లక్షలాది రూపాయలు వసూలు చేసి ఉండ వచ్చునని ఆరోపించారు.



## ఎన్‌కేవీటీలో అవగాహన వర్క్‌షాపు

రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 19: శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాల డిగ్రీ కళాశాలలో విద్యార్థి నులకు డిపోజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ వర్క్‌షాపును కళాశాల ప్రిన్సిపాల్ పి.రాఘవకుమారి అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతీఒక్కరూ తప్పనిసరిగా బ్యాంకింగ్ ఉత్పత్తులను, బ్యాంకు సేవలను ఉప యోగించుకోవాలని తెలియజేశారు. జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ డీవీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతీఒక్కరూ బ్యాంకింగ్ లావాదేవీలను, డిపోజిట్ ఖాతాల గురించి పూర్తిగా తెలుసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వి.సూరిబాబు, బి.వనజారత్నం, కె.వీర లక్ష్మి, ఏ.దేవి, డీఏకె లక్ష్మి, బి.చంటమ్మ, సివిరామలక్ష్మి పాల్గొన్నారు. ఈ వర్క్‌షాపు డైరెక్టర్ వి.అంజనేయులు, మేనేజర్ వి.అశోక్ కుమార్ పర్యవేక్షణలో నిర్వహిస్తామన్నారు.

## అంకాలమ్మ ఆలయం వద్ద భారీ అన్నసమారాధన

కోరుకొండ, జూన్19: మండలం ప్రధాన కేంద్రమైన కోరుకొండలో అంకాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద బుధవారం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల ఆలయం వద్ద అమ్మవారి జాతర మహోత్సవాలు వైభవంగా జరిపారు. గ్రామస్థులు పెద్దఎత్తున ఈ అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి అన్నప్రసాదాలు స్వీకరించారు.

## యువనేత నారా లోకేష్‌ను కలిసిన జవహర్

కొవ్వూరు, జూన్ 19 : రాష్ట్ర మంత్రి బాధ్యతలు స్వీకరించిన యువనేత నారా లోకేష్‌ను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవా రం రాష్ట్ర రాజధానిలో లోకేష్‌కు జవహర్, జవహర్ తనయుడు, రాజానగరం నియోజకవర్గం పరిశీలకులు, రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఆశిష్‌లాల్‌లు పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## మౌలిక సదుపాయాల కొరతతో కొట్టుమిట్టాడుతున్న డైట్

రాజమహేంద్రవరంరూరల్, జూన్ 19: రాజమహేంద్రవరం రూరల్‌మండలం బొమ్మూరులోని జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) కళాశాల మౌలిక సదుపాయాల లేమితో కొట్టుమిట్టాడుతుంది. కళాశాల వసతిగృహంలో తాగునీరు, ప్యాన్లు, వంటి కనీస సౌకర్యాలు లేకపోవడంతో బాలికలు ఇబ్బందులు పడుతున్నారు. డైట్ ఆవరణంలో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. వసతి గృహనికి వార్డెన్లు, నైట్ వాచ్‌మెన్‌లు లేకపోవడంతో రాత్రులు బాలికలు ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం 6 దాటితే విద్యార్థినిలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ప్రాంగణం శుభ్రం చేసే పనులు విద్యార్థినిలచే చేయించడం వంటి పనులు చేయిస్తున్నారు. చదువుకోవాల్సిన సమయంలో వారి గదులు, ప్రాంగణాలు వారే శుభ్రం చేసుకోవడం వంటి పనులతో విద్యార్థినిలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు తరచూ ప్రిన్సిపల్ జయశ్రీ ఫైన్‌ల పేరుతో ఇబ్బందులుపెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. కొంతమంది తప్పుదోవ పట్టకుండా తాను తీసుకుంటున్న క్రమశిక్షణ చర్యల వల్లన ఉపాధ్యాయులతో తనపై ఆరోపనలు చేయిస్తున్నారని జయశ్రీ చెబుతున్నారు. డైట్‌లో మౌలిక సదుపాయాలు లేమి ఉందనేది వాస్తవమనేది స్పష్టమౌతుంది.





ప్రొటెం స్పీకర్‌గా ఎన్నికైన గోరంట్లకు అధికారుల అభినందనలు



# ఈట్ స్ట్రీట్.. సంగతేంటి?

- బాలికల వసతి గృహాల నడుమ తినుబండారాల దుకాణాలు
- విద్యాలయ వాతావరణం కలుషితం
- కమీషన్ల కక్కుర్తితో వైసీపీ నేత ఏర్పాటు
- దూడూ బసవన్నల్లా అధికార గణం
- ఆహార భద్రత అనుమతులు నిల్
- నిబంధనలు బేఖాతర్
- ఎన్ని విమర్శలొచ్చినా బలాదూర్

**వైసీపీ నేతల ప్రాపకం కోసం గత ప్రభుత్వంలో కొందరు ఉన్నతాధికారులు దూడూ బసవన్నల్లా వ్యవహరించారు. వీరిలో నగరపాలక సంస్థ, జిల్లా ఉన్నతాధికారులు ముందు వరుసలో ఉంటారు. వైసీపీ వాళ్లు చెప్పడమే ఆలస్యం వీళ్లు ఆగమేఘాలకంటే వేగంగా ఏర్పాట్లు పూర్తి చేసేవారు. ప్రజల నుంచి ఎన్ని విమర్శలొచ్చినా చెవులకెక్కలేదు. నిబంధనలకు నీళ్లొదిలేశారు. అలాంటి అనాలోచిత కార్యక్రమాల్లో ఒకటి ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని 'ఈట్ స్ట్రీట్'. కమీషన్ల కక్కుర్తి మత్తులో ఓ వైసీపీ నేత ఈ దుకాణాల ఏర్పాటుకు 'ప్లాన్' చేశారు. దీనికి అధికారులు యథావిధిగా తలాడించారు. చక్కటి విద్యా వాతావరణం కలుషితమవుతున్నా కళ్లకు కనిపించలేదు. వసతి గృహాల బాలికల భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉన్నా పట్టింపేలేదు. యువతకు ఉపాధి మాటున దుకాణాలు పెట్టేశారు. ఒకసారి అగ్ని ప్రమాదం సంభవించగా అదృష్టవశాత్తూ వసతి గృహ విద్యార్థులు బయటపడ్డారు. ఈ ప్రాంతంలో ఈట్‌స్ట్రీట్ సరికాదంటూ రోడ్డెక్కిన ప్రజా, విద్యార్థి సంఘాల నోళ్లను వైసీపీ వాళ్లు భయంతో మూయించారు. అయితే.. ఇప్పుడు ప్రజాకాంక్షల ప్రభుత్వం వచ్చింది. దీంతో గత పాలకులు చేసిన తప్పులను సరిదిద్ది, అక్రమాలకు కొమ్ముకాసిన అధికారుల పనిపట్టే బాధ్యత నూతన పాలకులపై ఉంది. ఈట్ స్ట్రీట్, హ్యాపీ స్ట్రీట్ వంటి వాటి పని పడతారా? లేదా? అని జనం ఎదురు చూస్తుండడంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.**

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

ఈట్ స్ట్రీట్ పేరుతో ఎంతో చారిత్రక ఘనత ఉన్న ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో అర్ధరాత్రి దాటినా తెరిచి ఉంచే ఆహార దుకాణాలను ఏర్పాటు చేయడంపై అప్పట్లో పెద్దఎత్తున విమర్శలు వినిపించాయి. సాంస్కృతిక రాజధానిగా భాసిల్లే రాజమహేంద్రికి అనవసర పోకడలను పరిచయం చేయడం భావ్యం కాదనే ఆవేదనా వ్యక్తమైంది. ప్రజా సంఘాలు ఉద్యమాలు, ధర్నాలకు సైతం ఉపక్రమించాయి. అయితే అవేమీ వైసీపీ పాలకులకు కనబడలేదు. దీంతో ఇక్కడ సుమారు 40 వరకూ షాపులను ఏర్పాటుచేశారు. కార్పొరేషన్‌కి నెలకు రూ.10 వేల అద్దెతో లాటరీ పద్ధతిలో షాపులు కేటాయించారు. కానీ వాటిని దక్కించుకున్న వాళ్లు సబ్‌లీజుకు నెలకు సుమారు రూ.30 వేల ప్రాతిపదికన వేరొకరికి ఇచ్చేశారు. ఈ అక్రమాల వెనుక వైసీపీ నేతలు ఉన్నారని చెబుతారు. వారికి కార్పొరేషన్ ఉన్నతాధికారి కూడా కలిసి రావడంతో అడ్డూ అదుపూలేకుండాపోయింది. దీంతో రాత్రిళ్లు ఈ ముసుగులో దందాలు, సెటిల్‌మెంట్లు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ఒకసారి మునిసిపల్ కమిషనర్ తన కుటుంబంతో టిఫిన్ చేస్తుండగా దగ్గరలోనే యువత హల్‌చల్ సృష్టించారు. ఈట్‌స్ట్రీట్‌లో ధరలు కూడా విపరీతంగా దోచేస్తున్నారు.



విద్యార్థినుల హాస్టల్ గేటు వద్దే వంటకాలు

### పాపం విద్యార్థినులు..

ఈ దుకాణాల వల్ల విద్యార్థినులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. విద్యా వాతావరణం కాస్తా సంత మాదిరిగా తయారైంది. ఈ ఈట్‌స్ట్రీట్ చుట్టూ ఐదు బాలికల వసతి గృహాలు ఉన్నాయి. చీకటి పడితే వారంతా భయభయంగా గడపాల్సిందే. సాయంత్రం నాలుగు గంటలు దాటితే దుకాణాల వద్ద అరుపులు, కేకలు, కుర్రకారు హల్‌చల్‌తో వసతి గృహాల విద్యార్థినులు కనీసం దుస్తులు దండెంపై వేసేందుకు బయటకు రావడానికి కూడా భయపడుతున్నారు. కొందరు యువకులు ఈట్‌స్ట్రీట్‌కి వచ్చామనే మిషతో హాస్టళ్ల వద్ద తిరుగాడుతున్నారు. వసతి గృహాల బాలికలు, విద్యార్థినుల వైపు చూస్తూ అసభ్యకరంగా సైగలు చేయడం, వెకిలి చేష్టలకు దిగడం నిత్యకృత్యమైపోయింది. పైగా ఇక్కడ నూడుల్స్, కబాబ్స్, టిక్కా వంటి వంటకాల నుంచి వస్తున్న పొగ, వాసనకు విద్యార్థినులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కళ్లు మండుతున్నాయని చెబుతున్నారు. వీటికి తోడు వాహనాల హారన్లు, దుకాణాల్లో డీజే పాటల వల్ల రాత్రివేళల్లో చదువుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. కిటికీలు మూసుకొన్నా అర్ధరాత్రి వరకూ శబ్దాలతో హాస్టల్ విద్యార్థులకు కంటిపై కునుకు ఉండడం లేదు. పైగా ఇక్కడే అర్బన్ హెల్త్ సెంటర్, ఇంటర్ బోర్డు కార్యాలయం కూడా ఉండడం గమనార్హం. అయినా ఇది ఎవరికీ పట్టడం లేదు.

### అంతా అక్రమమే

ఈట్‌స్ట్రీట్‌లో నిబంధనలు అన్నీ ఉల్లంఘనలే. గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వాడేస్తున్నా అధికారుల కళ్లకు కానరావడం లేదు. మునిసిపల్ ట్యాంకరుతో తాగునీటిని ఉచితంగా అందిస్తున్నారు. ట్యాంకరు నీరు రూ.300 వరకూ ఉంది. ఈ లెక్కన రెండేళ్ల నుంచీ మునిసిపాలిటీ ఖజానాకు పెద్ద నష్టమే జరిగింది. ఇక్కడ వ్యాపారాన్ని తోపుడు బండి, మొబైల్ వాహనం కేటగిరీ కింద విభజించి ఆ మేరకు దుకాణాలు కేటాయించారు. అంటే వ్యాపార వేళలు ముగిసిన తర్వాత వాటిని తీసుకెళ్లిపోవాలి. కానీ కంటెయినర్లను తీసుకొచ్చి శాశ్వత ప్రాతిపదికన కొట్లు పెట్టేశారు. మొబైల్ వాహనం ఒక్కటీ లేదు. కంటెయినర్లనే వాహనాల కింద ఊహించుకోవాలనే చిత్రమైన సమాధానం అప్పట్లో అధికారుల నుంచి వినిపించేది. ఇక్కడ ఏర్పాటు చేసిన దుకాణాలకు ట్రేడ్ లైసెన్సులు తదితర అవసరమైన అనుమతులూ లేవని తెలుస్తోంది. ఏదో సాంకేతిక కారణం ఉందని సుమారు రెండేళ్ల నుంచీ మునిసిపల్ కార్పొరేషన్ తాత్సారం చేస్తోంది. దీంతో ఆహార నియంత్రణ అధికారులూ సంబంధిత ఫుడ్ సేఫ్టీ సర్టిఫికెట్లు ఇవ్వడానికి వీలు లేకుండాపోయింది. ఇష్టానుసారం నూనెలు, ఎసెన్సులు, రంగులు వాడేస్తూ ప్రజారోగ్యానికి చేటు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. మొత్తానికి ఎలాంటి అనుమతులూ లేకుండా, విద్యా వాతావరణాన్ని కలుషితం చేస్తున్న దుకాణాలకు జిల్లా అధికారులు సైతం వచ్చి తింటుండడం విస్మయం గొలుపుతోంది.

### అగ్ని ప్రమాదం జరిగినా..

ఈట్ స్ట్రీట్‌లో గత ఏడాది డిసెంబరు 23 అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్, జ్యూస్ సెంటర్ మంటల్లో దగ్ధమయ్యాయి. షాపుల్లోని సామగ్రి చాలామటుకు బూడిదైంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయితే బాలికల వసతి గృహాలకు సమీపంలోని దుకాణాలు కాలిపోయాయి. దీంతో అర్ధరాత్రి వేళ వసతి గృహాల్లోని పిల్లలు భయభ్రాంతులకు గురయ్యారు. రాత్రంతా కంటిపై కునుకు లేకుండా ఇబ్బంది పడ్డారు. పిల్లలు నిద్రించే సమయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఆ సమయంలో మంటలు హాస్టల్ లోపలకు వ్యాపించి ఉంటే బాధ్యులెవరని విద్యార్థులు, తల్లిదండ్రులు అడిగిన ప్రశ్నకు సమాధానం కరువైంది. విద్యార్థినుల భద్రత, ప్రజారోగ్యం దృష్ట్యా ఈ దుకాణాలపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వంటివి దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

### చదువుల వాతావరణం కలుషితం.. తరలిస్తాం

ఈట్‌స్ట్రీట్‌తో విద్యార్థినులు బాగా ఇబ్బంది పడుతున్నారు. కళాశాల వాతావరణం కలుషితం అవుతోంది. గతంలోనే నాకు ఫిర్యాదులు అందాయి. అయితే, ఎవరైతే ఫిర్యాదు చేశారో వాళ్లను వైసీపీ వాళ్లు భయపెట్టారు. ఎప్పుడైతే ప్రభుత్వం మారిందో ఈట్‌స్ట్రీట్, హ్యాపీస్ట్రీట్ సమస్యలను ప్రజలు నా దృష్టికి తీసుకొస్తున్నారు. వ్యాపారస్తులకు, ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోడానికి ఇప్పటికే ఉపక్రమించాం. కోటిలింగాల పేట గోదావరి గట్టుపైకి తరలించడానికి ప్రయత్నాలు మొదలుపెట్టాం. ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. ప్రజాభీష్టం మేరకు ఆ దిశగా చర్యలు చేపడుతున్నాం. వాటిని కచ్చితంగా త్వరలోనే తరలిస్తాం.

- ఆదిరెడ్డి వాసు,
రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే విజేత

### హాస్టల్ వద్ద చాలా సమస్యగా ఉంది

ఈట్‌స్ట్రీట్ పెట్టిన తర్వాత హాస్టల్ వద్ద చాలా సమస్యగా ఉంది. అర్ధరాత్రి వరకూ పెద్ద పెద్ద శబ్దాలతో పాటలు, వాహనాల మోత, గోలతో చదువుకోడానికి ఇబ్బంది అవుతోంది. నిద్ర కూడా సరిపడా ఉండడం లేదు. వంటలు అదో రకమైన వాసన వస్తుంటాయి. ఆ పొగకు కళ్లు మంటలు వస్తున్నాయి. మా గేటు వద్దే పొయ్యిలు పెట్టి వండుతున్నారు. అక్కడే బైకులు పార్కింగ్ చేస్తుండడంతో మేం బయట నుంచి వెళ్లేప్పుడు ఇబ్బంది పడుతున్నాం. పైగా కొంతమంది యువకులు ఈట్‌స్ట్రీట్ వంకతో హాస్టల్ బయట ఉంటున్నారు. వాళ్లను మేమే రమ్మన్నామనే అపవాదు పడుతోంది. అసలు విద్యార్థుల వసతి గృహాలు ఉండే ప్రాంతంలో ఇలాంటివి అవసరమా?.

- బ్లెస్సీ, బయోటెక్ విద్యార్థిని, రాజమహేంద్రవరం

## ప్రొటెం స్పీకర్‌గా గోరంట్ల

**అరుదైన గౌరవం.. పలువురి అభినందనలు**

**నేడు గవర్నర్‌చే బుచ్చయ్యచౌదరి ప్రమాణ స్వీకారం**

రాజమహేంద్రవరం రూరల్/సిటీ, జూన్19: రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి శాసనసభ ప్రొటెం స్పీకర్‌గా నియమితులయ్యారు. ఏడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన సీనియర్ నేత బుచ్చయ్యచౌదరి ప్రొటెం స్పీకర్ హోదాలో శుక్రవారం రాష్ట్ర అసెంబ్లీ తొలి సమావేశాల్లో ఎమ్మెల్యేలతో ప్రమాణస్వీకారం చేయించే బాధ్యతను సీఎం చంద్రబాబునాయుడు అప్పగించారు. ముందుగా గురువారం నాడు బుచ్చయ్యచౌదరితో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్ ప్రమాణస్వీకారం చేయిస్తారు. తర్వాత ప్రొటెం స్పీకర్ హోదాలో శాసనసభలో శుక్రవారం నూతన ఎమ్మెల్యేలతో గోరంట్ల ప్రమాణస్వీకారం చేయిస్తారు. అనంతరం స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌ల ఎన్నిక నిర్వహించనున్నారు. కాగా ప్రొటెం స్పీకర్ వంటి అరుదైన అవకాశాన్ని గోరంట్ల దక్కించుకోవడం పట్ల టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం రాజమహేంద్రవరంలోని గోరంట్ల నివాసానికి పలువురు ప్రభుత్వ అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వెళ్లి పుష్పగుచ్ఛాలతోను, శాలువాతోను సత్కరించి అభినందనలు తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ కే వెంకటేశ్వరరావు, సబ్‌రిజిస్ట్రార్ అధికారు లు, వివిధ శాఖల అధికారులు, అంగన్వాడీలు, ఆశవర్కర్లు, పంచాయతీ సెక్రటరీలు, రిటైర్డ్ ఉద్యోగులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ ప్రొటెం స్పీకర్ తనకు వద్దని చెప్పానని, ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ఫోన్ చేసి తనను ఎంపిక చేసినట్లు చెప్పారన్నారు. సీనియర్‌గా ఈ బాధ్యత స్వీకరించాలని అనడంతో అంగీకరించానని ఆయన చెప్పారు.



బుచ్చయ్య చౌదరికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న అభిమానులు



అమరావతిలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పవన్‌కల్యాణ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి కందుల దుర్గేష్

## పవన్‌కల్యాణ్‌కు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి దుర్గేష్

నిడదవోలు, జూన్19: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా కొణిదల పవన్‌కల్యాణ్ అమరావతి రాష్ట్ర సచివాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



చిరంజీవి పార్కు డిజైన్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

## చిరంజీవి పార్కుకు ఇక మహర్దశ!

**రూ.1.16 కోట్ల వ్యయంతో పార్కు ఆధునికీకరణ పనులు**

**డిజైన్ పరిశీలించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**

రాజమహేంద్రవరం సిటీ, జూన్19: నగరంలోని కంబాలచెరువు ప్రధాన రహదారిలో 20 ఏళ్ల కిందట నిర్మించిన చిరంజీవి పార్కుకు ఇన్నేళ్ల తర్వాత మహర్దశ పట్టనుంది. అప్పట్లో ఈ పార్కును ప్రారంభించడానికి మెగాస్టార్ చిరంజీవి వచ్చారు. కానీ కంబాలచెరువు సెంటర్‌ను వేలాదిమంది అభిమానులు చుట్టుముట్టగా, వేదిక దిగి కిందకు వెళ్లి ఆ పార్కు రిబ్బన్‌కట్ చేసే అవకాశం లేకపోవడంతో అప్పటి మేయర్ ఎంఎస్ చక్రవర్తి చేతుల మీదుగా చిరంజీవి ప్రారంభింపజేశారు. తర్వాతికాలంలో ఈ పార్కు నిర్వహణ సక్రమంగా లేక నిర్లక్ష్యానికి గురైంది. ఈ పార్కులో మదర్‌థెరిసా విగ్రహాన్ని కూడా అప్పుడే ప్రారంభించారు. కూటమి అధికారంలోకి వచ్చాక చిరంజీవి పార్కును తిరిగి నిర్మాణం చేపట్టడానికి సమయాత్తమయ్యారు. రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ నుంచి రూ. కోటి 16 లక్షల వ్యయంతో పార్కు పునర్నిర్మాణం, మదర్ థెరిసా విగ్రహం ఏర్పాటుపనులు చేపట్టనున్నారు. అందుకోసం పార్కు పాత గోడలు తొలగించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఈ పార్కును బుధవారం పరిశీలించారు. పార్కు నిర్మాణాలకు సంబంధించిన వివరాలను, ప్లాన్‌ను నగరపాలక సంస్థ డీఈ అలీ ఎమ్మెల్యేకు తెలిపారు.

### ప్రణాళికబద్ధంగా నగర అభివృద్ధి

రాజమహేంద్రవరంలో వైసీపీ పాలకులు చేసిన తప్పులు కడిగే ప్రయత్నం చేస్తున్నామని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. నగరంలో ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టినా స్థానికులకు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల వల్ల స్వలాభం తప్ప ప్రజల ఇబ్బందులను పరిగణలోకి తీసుకోలేదన్నారు. చిరంజీవి పార్కును వైసీపీ ప్రభుత్వం చాలా నిర్లక్ష్యం చేసిందన్నారు. చిరంజీవి సోదరుడు పవన్‌కల్యాణ్ భాగస్వామ్యంతో ఏర్పడిన కూటమి ప్రభుత్వ హయాంలో మళ్లీ ఈ పార్కును సుందరంగా తీర్చిదిద్దడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, జనసేన నగర అధ్యక్షుడు వై శ్రీను, శెట్టిబలిజసాధికార సమితి కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు, తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవీవరప్రసాద్, మజ్జి రాంబాబు, మరుకుర్తి రవియాదవ్, కోసూరి చండీప్రియ, మాలే విజయలక్ష్మి, దాస్యం ప్రసాద్, జనసేన నేతలు ఆసూరి సుధాకర్, గెడ్డం నాగరాజు తదితరులు ఉన్నారు.







విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్పులను అందజేస్తున్న ఎస్పీ జగదీశ్

## తల్లిదండ్రుల కలలను పిల్లలు సాకారం చేయాలి : ఎస్పీ

రాజమహేంద్రవరం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పిల్లలు కష్టబడి చదువుకుని తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఎస్పీ జగదీశ్ పిలుపునిచ్చారు. పది, ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు సాధించిన పోలీసు సిబ్బంది పిల్లలకు ఆయన మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో 56 మంది పిల్లలకు జిల్లా పోలీస్ సంక్షేమ నిధి నుంచి నగదు బహుమతులు ఇవ్వడంతోపాటు ఆయా స్కూళ్ల యాజమాన్యాలను సత్కరించారు. తల్లిదండ్రులతో, పెద్దవారితో గౌరవంగా నడుచుకోవాలని.. క్రమశిక్షణ, పట్టుదల లక్ష్యాన్ని చేరువ చేస్తాయని ఈ సందర్భంగా పిల్లలకు ఎస్పీ హితబోధ చేశారు. ఆసక్తి ఉన్న రంగంలోకి ప్రవేశించి సమాజానికి సేవ చేయాలన్నారు. విజయవంతమైన వ్యక్తులుగా కీర్తి గడించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఎల్.చెంచిరెడ్డి, సౌత్ జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ పాల్గొన్నారు.

## కడియపులంకలో భారీ చోరీ

- 10 కాసుల బంగారం, వెండి, రూ.లక్ష నగదు అపహరణ
- డీఎస్పీ అంబికాప్రసాద్, సీఐ తులసీధర్‌ల పరిశీలన - 6లో

## రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించాలి : నల్లమిల్లి

అనపర్తి, జూన్ 19 : తన అనపర్తి నియోజకవర్గంలో గత పాలకుల నిర్లక్ష్యంతో అనేక రోడ్లు అధ్వాన స్థితికి చేరుకున్నాయని, వాటి అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కలెక్టర్ మాధవీలతను కోరారు. బుధవారం రాజమహేంద్రవరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నల్లమిల్లి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో భేటీ అయిన ఎమ్మెల్యే అనపర్తి నియోజకవర్గంలో అధ్వాన స్థితికి చేరుకున్న రోడ్ల పరిస్థితిని ఆమెకు వివరించారు. అదేవిధంగా నియోజకవర్గంలోని అభివృద్ధి, నిర్వహణ పనులపై ఆయన చర్చించారు. ముఖ్యంగా కెనాల్ రోడ్డు దుస్థితిని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చానని, దీనికి ఆమె సానుకూలంగా స్పందించారని అన్నారు.



అనపర్తి నియోజకవర్గ అభివృద్ధిపై కలెక్టర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

## గంజాయి, సారా నిర్మూలనకు ఉక్కుపాదం మోపుతా

**ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా : ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి**

కడియం, జూన్ 19: గంజాయి, సారా వంటి మత్తుపదార్థాల వల్ల యువత పెడదోవ పడుతోందని, అందుకే వీటి నిర్మూలనకు ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని, వాటిపై ఉక్కుపాదం మోపుతామని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. కడియం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్ అధ్యక్షతన బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక గంజాయి వంటి మాదక ద్రవ్యాలు పెరిగిపోయాయన్నారు. నెలరోజుల్లోనే సారా, గంజాయి నిర్మూలనకు పటిష్ట చర్యలు చేపడతామన్నారు. ఇందుకోసం నాయకులు, తల్లిదండ్రులు, సహకరించాలన్నారు. ఎవరి సిఫార్సులను పట్టించుకోకుండా కేసులు నమోదు చేయాలని సీఐ తులసీధర్‌కు సూచించారు. గంజాయి రహిత నియోజకవర్గంగా రూరల్ నియోజకవర్గం త్వరలోనే మారుతుందని, గంజాయికి సంబంధించి మూలాలన్నింటిని సమూలంగా అరికడతామన్నారు. దీనికి అధికారులతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో పరిపాలన గాడి తప్పిందని, వాటిని చక్కబెట్టేందుకు చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ నేతృత్వంలో ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు వివరించారు. అయితే నెలరోజుల్లో అన్ని శాఖల అధికారులు నియోజకవర్గంలోని కడియం మండలం పరిధిలో సమస్యలు, వాటి పరిష్కారానికి కావాల్సిన నిధుల వివరాలను రూపొందించాలని, అభివృద్ధికి అవసరమైన నిధులు సమకూర్చడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి పదవి రానందుకు తనకు విచారం లేదని, ప్రజాసేవ చేయడానికి ఎమ్మెల్యే పదవి సరిపోతుందని, త్వరలోనే తమ పాలనను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఐదేళ్లపాటు ఎమ్మెల్యేగా ఉన్న తనకు గత ప్రభుత్వం ఏనాడు ప్రొటోకాల్ పాటించలేదని, వైసీపీ ప్రభుత్వం వంటి దుర్మార్గపు పాలన, కక్షసాధింపు తన రాజకీయ జీవితంలో ఏనాడూ చూడలేదని గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్, వైస్ ఎంపీపీలు కలిదిండి విశాలాక్షి, పంతం గణపతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీడీవో రాజ్‌మనోజ్, సీఐ తులసీధర్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.



కడియం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే గోరంట్లను సత్కరిస్తున్న ఎంపీపీ ప్రసాద్, వైస్ ఎంపీపీ పంతం గణపతి

## ఆ.. ఇసుక ఆపండి!

- ఎవరు అనుమతిచ్చారో.. ఎవరెవరో దోచుకుపోతున్నారు
- జనసేన సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ ఆరోపణ

రాజమహేంద్రవరం, జూన్19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో అక్రమంగా తవ్వి, స్టాక్ పాయింట్లుగా పెట్టిన ఇసుకను ఎవరెవరో ఎత్తుకుపోతున్నారని, కొత్త ఇసుక విధానం అమలులోకి వచ్చేవరకూ ఎక్కడి ఇసుకను అక్కడే ఉంచాలని రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి అనుశ్రీ (అత్తి) సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. లాలాచెరువు స్టాక్ పాయింట్ నుంచి అధికారులెవరో అనుమతిచ్చారని, ఎవరో అమ్మేసుకుంటున్నారన్నారు. ముందు అధికారులు జిల్లాలో ప్రస్తుతం స్టాక్ పాయింట్లలోనూ, గోదావరి ర్యాంపుల గట్టు మీద ఎంత ఇసుక ఉందో లెక్కలు తెలియజేయాలని, జిల్లాలో సుమారు స్టాక్‌లలోనే 6 లక్షల టన్నుల ఇసుక ఉంటుందని, ఇక ర్యాంపులలో మరింత ఇసుక రాశులు ఉన్నాయని ఆయన అన్నారు. అధికారులు జోక్యం చేసుకుని, వెంటనే ఈ ఇసుక తరలిపోకుండా ఆపాలని సత్యనారాయణ కోరారు.

# తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం





దేవరపల్లి నుంచి విజయవాడ సైకిల్‌యాత్ర చేస్తున్న టీడీపీ నాయకులు

## టీడీపీ నాయకుల సైకిల్ యాత్ర

దేవరపల్లి, జూన్ 19: టీడీపీ, ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రావాలని గోపాలపురం నియోజకవర్గ అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు విజయం సాధిస్తే విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారికి సైకిల్ పై వెళ్లి మొక్కు తీర్చుకుంటామని దేవరపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కవల సురేష్, లక్కా శ్రీనివాస్‌లు బుధవారం బయల్దేరి వెళ్లారు. ముం దుగా స్థానిక గ్రామదేవత కడియాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సైకిల్‌యాత్రలో టీడీపీ నాయకులు గన్నమని హరికృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు యాగంటి వెంకటేశ్వరరావు, ఓరుగంటి లక్ష్మీపతిరాజు, ఉప్పులూరి రాంబాబు, ఓరుగంటి రామచంద్రరాజు, కంబాల సత్తిబాబు, సూరిశెట్టి బాలు, దుగ్గిన గంగాధరరావు, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణా కార్యక్రమం

తాళ్ళపూడి, జూన్ 19: తాళ్ళపూడి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఐసీడీఎస్‌శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు రెండురోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఆడపిల్లల అక్రమ రవాణా చేస్తూ మోసగిస్తున్న సంఘటనలు, బలవంతంగా లైంగిక వ్యాపారంలోకి దించుతున్న సంఘటనల నేపథ్యంలో ఆడపిల్లలకు రక్షణ కల్పించేలా శిక్షణ ఇస్తున్నట్లు ప్రజ్వల స్వచ్ఛంద సేవా సంస్థ కోఆర్డినేటర్ శ్రావ్య శృతి తెలిపారు. ఉన్నత పాఠశాలల్లో ఆడపిల్లలకు ఈ అవగాహనా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఆడపిల్లలు మోసాలకు గురవ్వకుండా అవ గాహన కలిపిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో సీడీపీవో మమ్మి, ఎంపీడీవో టీబీవీ రమణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం

తాళ్ళపూడి, జూన్ 19: తాళ్ళపూడి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ విశ్రాంత ఉద్యోగుల సంఘ మండల సర్వసభ్య సమావేశం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షుడు మారిశెట్టి నాగేశ్వరరావు, కార్యదర్శి వి.చంద్రయ్య సారథ్యం వహించారు. కార్యక్రమంలో చంద్రయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ ఎన్డీఏ ప్రభుత్వంలో నైనా తమ కష్టాలు తీరతాయని వ్యక్తంచేస్తూ నూతన ప్రభుత్వానికి అభినందనలు తెలుపుతూ గత ప్రభుత్వం కంటే మెరుగైన పరిపాలన అందించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కేవీపీఎస్ నాయకులు

నిడదవోలు, జూన్ 19: జగనన్న విదేశీ విద్య పేరును మార్చి అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పేరును కొనసాగిస్తున్నట్టుగా కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభు త్వం జీవో విడుదల చేయడం ఎంతో అభినంద నీయమని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు అన్నారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ నాయకులు జువ్వల రాంబాబు మాట్లాడు తూ గత వైసీపీ ప్రభుత్వం అంబేడ్కర్ పేరుతో ఉన్న విదేశీ విద్యా పథకాన్ని పేరు మార్చి జగనన్న విదేశీ విద్య పేరును పెట్టుకోవడం ఎంతో దుర్మార్గమని దానిని ఖండిస్తూ ఎన్నో ఆందోళనలు నిరసనలు తెలియజేశామన్నారు. ఇప్పటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అందరూ ఎంతో హర్షం వ్యక్తం చేస్తున్నా రన్నారు. కార్యక్రమంలో వరసాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఫొటో, వీడియో గ్రాఫర్లకు సొమ్ములు చెల్లించాలి



ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజును కలిసిన ఫొటోగ్రాఫర్లు

దేవరపల్లి, జూన్ 19: గోపాలపురం నియోజకవర్గంలో ఎలక్షన్ నిమిత్తం పని చేసిన వీడియో గ్రాఫర్లకు సొమ్ములు చెల్లించాల్సి ఉండగా గోపాలపురం ఎమ్మార్వో వనజాక్షి డబ్బుల కోసం 29రోజులుగా తిప్పించుకుంటున్నారని బకాయిలు చెల్లించాలని ధర్నాచేసినా స్పందించటంలేదని ఫొటోగ్రాఫర్లు బుధవారం నల్లజర్లలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజును కలిసి తమ గోడును వివ రించుకున్నారు. ఫొటో, వీడియో గ్రాఫర సంఘం నాయకులు సిర్రా సూర్య గూడూరి సుబ్రహ్మణ్యం, బాలు, కే.చంద్రరావులు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎలక్షన్స్‌లో 59రోజులు డ్యూటీ చేశామని మాకు రూ.27లక్షలు రావల్సి ఉండగా రూ.6లక్షల 70వేలు మాత్రమే ఇచ్చారని మిగిలిన సొమ్ముల కోసం ఎన్నిసార్లు ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ తిరిగిన స్పందించటం లేదన్నారు. ఎమ్మెల్యే మద్దిపాటి స్పందిస్తూ 24 గంటల్లో మీ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఫొటో, వీడియో గ్రాఫర్లు ఎస్.కిషోర్, పూర్ణ, కే.రామకృష్ణ, మణికంఠాచారి, సాయి, త్రినాద్, సాయిశ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాల్లో పవన్,చంద్రబాబు చిత్రపటాల ఏర్పాటు



చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలను ఊరేగింపుగా తీసుకెళుతున్న దృశ్యం

పెరవలి, జూన్ 19 : ఆయా గ్రామాల సచివా లయాల్లో సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల చిత్రపటాలు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. మండలంలో పలు సచివాలయాల్లో ఇప్పటికే చిత్రపటాలు ఏర్పాటు చేశారు. బుధవారం తీపర్రులో టీడీపీ, జనసేన నాయకులు గ్రామంలో ఊరేగింపుగా సచివాలయానికి వెళ్లి లోపల ఈ చిత్రపటాలు అమ ర్చారు. కార్యక్రమంలో ఇరుపార్టీల నాయకులు కంటిపూ డి సూర్యనారాయణ, పత్తిపాటి ప్రసాద్‌కుమార్, నందమూరి నారాయణరావు, జనార్ధనరావు పాల్గొన్నారు.

## ఛత్రపతి శివాజీ చేసిన కృషి ఎనలేనిది

కొవ్వూరు, జూన్ 19 : కొవ్వూరు పట్టణంలోని రాజీవ్‌కాలనీలో ఛత్రపతి శివాజీ మహరాజ్ పట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహించారు. బుధవారం రాజీవ్ కాలనీలో హిందూ సామ్రాజ్యవాద దినోత్సవాన్ని ఆర్ ఎస్ఎస్ గోదావరి విభాగ్ సహ కార్యావహ మోహనకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఛత్రపతి శివాజీ మహాసేన ఆధ్వర్యంలో శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పిక్కి నాగేంద్ర, కొమ్ము సుబ్బారావులు మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ, దేశ రక్షణ, మెరుగైన సమాజ నిర్మాణం కోసం ఛత్రపతి శివాజీ చేసిన కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో బెనుగు రమేష్, ఉప్పాడ భూ చక్రవర్తి, గోవిందు, చొక్కా సాయి, పోణంగి పవన్, గోవర్ధనం శ్రీనివాసమూర్తి, గోలింగాచార్యులు, కొండపల్లి రత్నసాయి, వై.కె. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు

## విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ

కొవ్వూరు, జూన్ 19 : పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మరపట్ల కళాధర చక్రవర్తి అన్నారు. కొవ్వూ రు మండలం వేములూరు దొరయ్యచెరువు కాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధా నోపాధ్యాయులు పి.శ్రీనివాస్ అధ్యక్షతన విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, బ్యాగ్స్ పంపిణీ చేశారు. కళాధర్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, బా ణాల లక్ష్మి, చిమ్మ సత్యవతి, చుక్కా శ్రీనివాసు, ఉపాధ్యాయులు కె.రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

# జగనన్నకాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి

● కూటమి ఎమ్మెల్యే విజేత ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, జూన్ 19 : పేద ప్రజలకు సెంటు భూమి ఇచ్చి ప్రజాధనంతో జగన్మోహన్‌రెడ్డి విలాసవంతమైన భవంతులు నిర్మించుకున్నారని కొవ్వూరు కూటమి ఎమ్మె ల్యే విజేత ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. బుధ వారం కొవ్వూరు పట్టణంలోని లేఅవుట్ - 1 & 2లను పరిశీలించి ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీలో రేషన్ సరిగా అందించడంలేదని, ఇంటి నిర్మాణానికి సంబంధించి లోన్ అమౌంట్ పడలేదని, ఇంటి నిర్మాణం పూర్తయినా విద్యుత్ కనెక్షన్ అందించ డం లేదని, ఇంటిపై ఉన్న విద్యుత్ లైన్లు తొలగించాలని ఎమ్మెల్యే కోరారు. తాగునీరు సరిగా అందడంలేదని వాపోయారు. ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం సెంటు భూమి ఇచ్చి ఇంటి నిర్మాణం త్వరితగతిన పూర్తిచేయాలని ప్రజలను ఒత్తిడి చేసి ఇబ్బందులకు గురిచేసి అప్పులపాలు చేశారన్నారు. 80 శాతం పూర్తయిన టిడ్కో గృహాలను 20 శాతం పూర్తిచేసి ఇవ్వలేక పోయారు. జగనన్నకాలనీలలో పరిస్థితి అంతేనన్నారు. ఇళ్లు ఇచ్చారు కానీ తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు, మెయిన్‌రోడ్లలో వీధి దీపాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పాలవుతున్నారన్నారు. ఎటువంటి సదుపాయాలు చూపించలేదన్నారు. వైసీపీ ప్రభుత్వం, జగన్మోహనరెడ్డి చేసిన తప్పులు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రభుత్వ కాలనీలలో అన్నిరకాల సదుపాయాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపాల్టీ ఆధ్వర్యంలో ప్రతిరోజు తాగునీరు ట్యాంకరు ద్వారా అంద జేస్తామన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రధాని మోదీ సహకారంతో ముఖ్యమంత్రి నారాచంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కళ్యాణ్‌ల నేతృత్వంలో ఇళ్లు లేని పేదలకు పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇంటి స్థలం అందజేస్తామన్నారు. జగన్మోహనరెడ్డి విలాస మందిరాల్లో బాత్‌రూమ్‌లో రూ. 30లక్షలు పెట్టి టబ్‌లు, రుషికొండలో రూ.500 కోట్లలో 12 గదులతో విలాస మందిరం నిర్మించారన్నారు. బెంగులూరు, హైదరాబాద్, తాడేపల్లి, పులివెందుల, రుషికొండలో ఒక ప్యాలస్ చొప్పన ప్రజాధనం వెచ్చించి విలాస మందిరాలు నిర్మాణం చేపట్టారన్నారు. జగన్‌రెడ్డి నివాసం ఉండడానికి ప్యాలస్‌లు కావాలి. పేద ప్రజలకు మాత్రం సెంటు భూమి ఇచ్చి ఇంటి నిర్మాణం చేపడతామని చెప్పి మోసగించి, ఇబ్బందుల పాలు చేశారన్నారు. రూ.1.80 లక్షలు ఇచ్చి ఇంటి నిర్మాణం పూర్తిచేయకపోతే ఇంటి స్థలం రద్దుచేస్తామని ఇబ్బందులకు గురిచేశారు. ఒక లేఅవుట్ ఏర్పాటుచేస్తే రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు ఉంటేనే అనుమతులు ఇస్తామని రుడా సంస్థను తీసుకువచ్చారు. ఇక్కడ ఏ సదుపాయాలు లేక నిర్మాణాలు ఏ విధంగా చేస్తారని ప్రశ్నించారు. బోర్లు వేశారు ఆ నీరు దుర్వాసన వస్తుందని ప్రజలు వాపోతున్నారు. కాలనీలో నివసిస్తున్న ప్రజలకు తాగునీరు, రేషన్ సక్రమంగా అందించాలని అధికారులను ఆదేశించారు. ఆరికిరేవుల రోడ్డు మీద బస్సు దిగితే కాలనీకి వచ్చే రహదారిలో విద్యుత్ దీపాలు వెలిగించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. రేషన్ అందించకపోవడంతో సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్‌కు ఫోన్‌చేసి రేషన్ సక్రమంగా అందించని సిబ్బందిపై శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, పిల్లలమర్రి మురళీకృష్ణ, బి.వి.ముత్యాలరావు, కొప్పాక విజయకుమార్, డేగల రాము, గంగుమళ్ల స్వామి, గోపాల్, యలమంచిలి తిరుపతిరావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పట్టణంలోని లేఅవుట్-2లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే విజేత ముప్పిడి

# సికిల్ సెల్ ఎనీమియా అంటువ్యాధి కాదు

● జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 19: సికిల్ సెల్ ఎనీమియా (కొడవలి కణ రక్తహీనత) అంటువ్యాధి కాదని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే.వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన దినోత్సవం బుధవారం రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు గ్రామంలో ట్రైబల్ వెల్ఫేర్ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగింది. దీనికి అధ్యక్షత వహించిన డాక్టర్ కే వెంకటేశ్వరావు మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి కేవలం జన్యుపరంగా తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమిస్తుందన్నారు. సికిల్ సెల్ వ్యాధి రక్తహీనతను 2023 బడ్జెట్‌లో ఏర్పాటుచేసి 2047 నాటికి నిర్మూలించే మిషన్ను ప్రకటించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన గ్రామాల్లో జీరో నుంచి45 ఏళ్ల మధ్య వయస్సున్న జనాభాకు అవగాహన కల్పించడం సార్వత్రిక నిర్ధారణ పరీక్షలు కౌన్సెలింగ్ ద్వారా ఈ వ్యాధిని అరికట్టడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. జిల్లా ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ హరిచంద్ర మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి వారసత్వంగా వచ్చిన ఎర్ర రక్తకణాల రుగ్మతల సమూహమని రక్తంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తికి కారణమయ్యే జన్యువులు లోపబలిష్టంగా మారుతాయని తెలిపారు. ఆక్సిజన్ శాతం తక్కువగా ఉన్న ప్రాంతాలలో హిమోగ్లోబిన్ కొడవలి కణాలుగా మారి తద్వారా ఏ భాగంలో నైనా కణజాలం మారడం వలన రక్తహీనత పరిస్థి తులకు దారి తీస్తుందని జన్యు లోపం వలన దీనిని సికిల్ సెల్ ఎనిమియా అనే పిలువబడే తీవ్రమైన వ్యాధికి దారితీస్తుందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వరరావు

అనంతరం జిల్లా గిరిజన సంక్షేమాధికారి కేఎన్ జ్యోతి, డీపీఎంయూ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ అభిషేక్‌రెడ్డి జిల్లా ఏపీడమాజిస్ట్ సుధీర్ బాబులు మాట్లాడారు. వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం వినియోగం, తరచూ నీళ్లుతాగడంపై అవగాహన కల్పించారు. కళ్లు పసుపుగా మారడం, తీవ్రమైన ఒళ్లునొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడటం ఈ వ్యాధి లక్షణమని తెలిపారు. గర్భాధరణ సమయంలో సమస్యలు వస్తే అవయవ నష్టం కలగవచ్చని తెలిపారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ వ్యాధి నిర్ధారించడానికి ఎలక్ట్రోఫోరేసిస్ అనే రక్తపరీక్ష ద్వారా మాత్రమే నిర్ధారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాల హెడ్ మిస్ట్రెస్ బి.సీత, డిప్యూటీ వార్డెన్ బి.కర్రమ్మ, పీడీ జి.చిన్నారావు, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్‌గాంధీ పుట్టినరోజు

కొవ్వూరు, జూన్ 19 : కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు రాహుల్‌గాంధీ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం కొవ్వూరు పట్టణంలోని వాత్సల్యా వృద్ధాశ్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్‌చేసి, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గంధం బాపూజీ, గెడ్డం సాయిబాబా, సాయన సుబ్బారావు, కొయ్య వెంకట్రావు, ఎం.సత్యనారాయణ, పాలకుర్తి ప్రభాకరరావు, నల్లమాటి లక్ష్మీనారాయణ, నేతల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**నిడదవోలు:** దేశంలో ప్రజాస్వామ్యం అమలు జరగాలన్నా రాజ్యాంగం విలువలు కాపాడాల న్నా కాంగ్రెస్‌పార్టీతో మాత్రమే సాధ్యమని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి చిన్నం మురళీకృష్ణ అన్నారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని పార్టీ కార్యాల యంలో కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ పుట్టినరోజును పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి చిన్నం మురళీకృష్ణ మాట్లాడుతూ కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గతంలో నిర్మించిన టిడ్కో గృహాలను పేదలకు అందించే ప్రయత్నం చేయాలని కోరారు. కార్యక్రమంలో అగర్వాల్ హీరాలాల్, భావన రమేష్, హుస్సేన్ జహా, పడాల అచ్యుత, పులుగు అప్పారావు తదితర్లు పాల్గొన్నారు.





కొవ్వూరు వాత్సల్యా వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీచేస్తున్న కాంగ్రెస్ నాయకులు



నిడదవోలు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాహుల్ గాంధీ పుట్టినరోజు నిర్వహిస్తున్న నాయకులు

## కడియపులంకలో భారీ చోరీ

● సుమారు 10 కాసుల బంగారం, వెండి, రూ.లక్ష నగదు అపహరణ
● డీఎస్పీ అంబికాప్రసాద్, సీఐ తులసీధర్‌ల పరిశీలన



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ అంబికా ప్రసాద్

కడియం, జూన్ 19 : కడియపులంకలో భారీ చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కడియపులంక గ్రామానికి చెందిన కర్రి వెంకటేశ్వరరావు అనే చంటి ఇంటిలో ఈ దొంగతనం జరిగినట్లు పోలీసులు తెలిపారు. వెంకటేశ్వరరావు తన కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం రాత్రి సమీపంలో ఉన్న అత్తారింటికి వెళ్లారు. ఆ సమయంలో వెంకటేశ్వరరావుకు చెందిన ఇంటి తాళాలు బద్దలుగొట్టి, బెడ్‌రూమ్‌లో ఉన్న బీరువాను పగలకొట్టి అందులో ఉన్న 10 కాసుల బంగారు ఆభరణాలు, విలువైన వెండి, రూ. లక్ష నగదు అపహరించుకుపోయారు. ఉదయం వెంకటేశ్వరరావు వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు బద్దలు గొట్టి ఉన్నట్లు, బీరువా తెరచి ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, సీఐ తులసీధర్, పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. వెంకటేశ్వరరావు అలియాస్ చంటి ఫిర్యాదు మేరకు సీఐ తులసీధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● కడియంలో జరిగిన మండల పరిషత్ సమావేశానికి వచ్చిన రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి విషయం తెలియడంతో కడియపులంక వెళ్లారు. వెంకటేశ్వరరావు సోదరుడు ఏసయ్యతో మాట్లాడారు. సంఘటనను చేధించి నిందితులను పట్టుకుని బంగారం, వెండితో పాటు నగదును కూడా రికవరీ చేసి వెంకటేశ్వరరావుకు న్యాయం చేయాలని పోలీసులకు చెప్పినట్లు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు.

## రంపయర్రంపాలెంలో ఉపాధి కూలీ మృతి



మృతుడు కరణం వెంకటేశులు

గోకవరం, జూన్ 19: ఉపాధి పనికి వెళ్లి ఒక కూలీ మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలోని రంపయర్రం పాలెం లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కరణం వెంకటేశులు(50) ఎప్పటిలాగే ఉపాధిపనికి వెళ్లాడు. కొంతసేపు పనిచేసిన అనంతరం వెంకటేశులు ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీంతో వెంటనే తోటి కూలీలు వెంకటేశులకు సీపీఆర్ నిర్వహించి ఆటోలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ దుర్గారావు తెలిపారు. జరిగిన విషయాన్ని ఉపాధి సిబ్బంది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

## తానేటి వనిత అవినీతి అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి

● లిబరేషన్ కాంగ్రెస్‌పార్టీ నాయకుడు బొంతా శ్యాంరవిప్రకాష్ డిమాండ్

కొవ్వూరు, జూన్ 19 : మాజీ హోంమంత్రి తానేటి వనిత అవినీతి అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని లిబరేషన్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు బొంతా శ్యాం రవిప్రకాష్ డిమాండ్ చేశారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని అనేకమంది వద్ద నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేశారని సీబీఐ విచారణ జరిపిస్తే వాస్తవాలు బయటికి వస్తాయన్నారు. ఆమెకు వ్యతిరేకంగా మాట్లాడేవారిపై అక్రమ కేసులు బనాయించేవారని, దళిత యువకుల హత్య కేసుల్లో బాధితులకు కనీసం న్యాయం జరగలేదని, పోలీసు నియామకాలలో లక్షలాది రూపాయలు వసూలు చేసి ఉండవచ్చునని ఆరోపించారు. ఇసుక, మట్టి మాఫియాల నుంచి కోట్లాది రూపాయలు కొల్లగొట్టారన్నారు. చిడిపి లంక భూమి, దేచర్ల దళితుల భూములలో నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తవ్వి వాటాలు తీసుకున్నారన్నారు. నిరుద్యోగ యువతను మోసం చేసినందుకు ఆమె అన్నపై కేసులు నమోదు అయ్యాయని, హోంమంత్రిగా ఉండడంతో బాధితులు ముందుకు రాలేదన్నారు. ఆమె కుటుంబ సభ్యుల ఆస్తులపై విచారణ చేపడితే బినామీలు బయటకు వస్తారన్నారు.

## ‘విద్యుత్ సక్రమంగా ఇవ్వాలి’



బంధపురంలో విద్యుత్ సక్రమంగా ఇవ్వడం లేదని ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

దేవరపల్లి, జూన్ 19: విద్యుత్ సరఫరా సక్రమంగా ఇవ్వకపోవడం అధికారుల నిర్లక్ష్యం కారణంగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్థులు బుధవారం ఆందోళన తెలిపారు. మండలంలోని బంధపురం గ్రామంలో గ్రామస్థులు దుద్దుపూడి హరిబాబు, బాలం వెంకటసుబ్బారావు, సుంకర రాంబాబు, సుంకర శ్రీనివాస్, శొంఠి కాశీవిశ్వనాథం, మాట్లాడుతూ బంధపురం గ్రామంలో 15, 16 తేదీల్లో గ్రామంలో ముత్యాలమ్మ జాతర జరిగిందని మిత్రులు బంధువులు జాతరకు వచ్చారు. గృహాల్లో విద్యుత్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యామని విద్యుత్ సమస్యపై ఎన్నిసార్లు విద్యుత్‌శాఖ ఏఈకి చెప్పిన స్పందించలే1దని నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో లోఓల్టేజ్ సమస్య విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో తాగునీటికి కూడా ఇబ్బం దిపడుతున్నామన్నారు. సమస్యలు పరిష్కరించ కపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ ఆందోళనలో గ్రామస్థులు తదతరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం కావాలి

● ఎస్పీల సమావేశంలో పీడీజే సునీత ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న రాజీకి యోగ్యమైన కేసులు అధిక మొత్తంలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. ఈమేరకు ఆయా జిల్లాల ఎస్పీల తో బుధవారం సమావేశమై పలు సూచనలు చేశారు. సివిల్, క్రిమినల్, ప్రీ-లిటిగేషన్ కేసులతోపాటు అదన పు జిల్లా న్యాయస్థానాల్లోని మోటారు వాహనాల ప్రమాదాల కేసుల్లోని బాధితులకు తగు పరిహారం అందించడంలో ప్రత్యేక చొరవ చూపాలన్నారు. బార్ అసోసియేషన్ల అధ్యక్షులతో కూడా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్పీలు పి.జగదీశ్, ఎస్.సతీశ్ కుమార్, ఏ.జగదీశ్, ఎస్.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ టెక్నాలజీ డిప్లమా కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 19: తిరుపతి జిల్లా వెంకటగిరిలోని శ్రీప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండి యన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ కళాశాలలో హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ టెక్నాలజీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎస్‌పీకేఎం ఐఐహెచ్‌టీ ఓఎస్‌డీ ఎస్.గిరిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల కు చెందిన అభ్యర్థులు రెండు, మూడేళ్ల ఈ కోర్సులో చేరవచ్చిన ఈనెల 20న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని తెలిపారు. దరఖాస్తు పొందడానికి డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఐఐహెచ్‌టీవీజీఆర్.కామ్ వెబ్‌సైట్ తిలకించాలని కోరారు. వివరాలకు 9441795408, 9866169908, 9010243054ను సంప్రదించాలని కో రారు.

## యువనేత నారా లోకేష్‌ను కలిసిన జవహర్



కొవ్వూరు, జూన్ 19 : రాష్ట్ర మంత్రి బాధ్యతలు స్వీకరించిన యువనేత నారా లోకేష్‌ను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం రాష్ట్ర రాజధానిలో లోకేష్‌కు జవహర్, జవహర్ తనయుడు, రాజానగరం నియోజకవర్గం పరిశీలకులు, రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఆశిష్‌లాల్‌లు పుష్ప గుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## లక్ష్మీనారాయణ స్వామికి విశేష పూజలు



నిడదవోలు మండలం ముని పల్లిలో విశేష పూజలందుకున్న శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి

నిడదవోలు, జూన్ 19: నిడదవోలు మండలం మునిపల్లి గ్రామంలో ఉన్న శ్రీ లక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో బుధవారం విశేష పూజలు నిర్వహిం చారు. ఉదయం నుంచి విష్ణు సహస్రనామం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## గోశాలకు నిత్యావసరాలు అందజేత

కొవ్వూరు, జూన్ 19 : కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో ఉన్న సుందర గోవిందుని గోశాలకు లయన్స్ క్లబ్ సభ్యులు త్యావసరాలు అందజేశారు. బుధవారం లయన్స్‌క్లబ్ అధ్యక్షులు కలగర వెంకట్రావు ఆధ్వర్యంలో పిల్లలమర్రి సర్వేశ్వరరావు బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ప్రసాదం నిమిత్తం రూ. 25 వేల విలువైన 5 బస్తాల బియ్యం, నూనె, చింతపండు, బెల్లం, పంచదార అందజేశారు. బూరుగుపల్లి వెంకటేశ్వరరావు రూ. 5116లు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షులు మద్దిపాటి సత్యనారాయణ, యనమదల సుబ్రహ్మణ్యం, నాళం శ్రీనివాస్, మన్యం బుల్లిబాబు, ఉప్పులూరి రామకృష్ణ, పెనుమాక జయరాజు తదితరులు పాల్గొన్నారు.



గోశాలకు నిత్యావసరాలను అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

## సుబ్రహ్మణ్యస్వామి ఆలయ పునః నిర్మాణానికి కోసూరి కుటుంబం రూ.1.01 లక్షలు విరాళం

కోరుకొండ, జూన్19: కోరుకొండ శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పునః నిర్మాణానికి గ్రామానికి చెందిన కోసూరి చిన్నారావు వారి తల్లిదండ్రులు జ్ఞాపకార్థం రూ.1,01116లు విరాళాన్ని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ కమిటీకి అందజేశారు. అదేవిధంగా బొరుసు త్రిమూర్తులు, నాగమణి దంపతులు బొరుసు బద్రినారాయణ, దుర్గ దంపతులు రూ.10,116లు విరాళంగా అందజేశారని ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోసూరి చిన్నారావు,వీరేష్, కేతినీడిఅశోక్, దూలం పెద్ద, తదితరులు పాల్గొన్నారు.

### సినిమా గైడ్

| | |
|---|---|
| **కొవ్వూరు** | |
| యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1 | మనమే |
| వై.స్క్రీన్2 | మహారాజ |
| దేవిశ్రీ(గాయత్రి) | హరోంహర |
| అనన్య | తమ్ముడు |
| **నిడదవోలు** | |
| వీ మ్యాక్స్ | మనమే |
| రాధాకృష్ణ | మహరాజా |
| శ్రీగణపతి | హరోమ్ హర |
| **దేవరపల్లి** | |
| శ్రీరామ్ సినీ మ్యాక్స్ | మనమే |
| శ్రీరామ్ సినీ మ్యాక్స్ | మనమే |
| **నల్లజర్ల** | |
| శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1 | గంగం గణేశా |